ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము మార్చి ౧౯౩౮ { సంచిక 3

"అపి దళతి వజ్రస్య హృదయమ్"

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"బాగా ఆలోచించుకోండి"

"నాకే కాని నీకక్కర లేదా యేమిటి ఆలోచన?"

"..................."

"..................."

"కాని కాలం వచ్చి పడింది. మూడేళ్లయి సమర్తాడిన కోడల్ని పుట్టింట ఒట్టేపెట్టేసి వూరుకోడం—అపవాదు పుట్టిందంటే మాపుకోలేము సుమండీ"

"తల్లికీ, తండ్రికీ లేని బాధ మనకేం?"

"మనం మాత్రం తల్లిదండ్రులం కామూ యివతలా?"

"అయితే?"

"మన కోడలు—"

"కార్యం అయి మన యింటికి వచ్చేదాకా కోడలంటే యేమన్న మాట? ఇప్పుడు మనకేమీ పూచీ లేదు. చల్లగా వూరుకో"

"వద్దు సుమండీ! తనువులు శాశ్వతాలు కావు"

"నిజమే"

"మాట కలకాలం వుండిపోతుంది"

"అదీ నిజమే"

"......ఇంకేం చెప్పగల నమ్మా నేనూ?"

"నువ్వు చెప్పగలగడానికి సందంటూ వుండనిస్తే కాదు టయ్యా నేనూ?"

"..................."

"వూరికే దోడదోడ మాట్లాడగానే సరా? లాపాయం టుండాలి—"

"ఇంకా చెప్పుకోవాలి తగుదు నమ్మా అని"

"ఏం లోటు వచ్చిందీ?"

"నలుగురూ యేమనుకుంటున్నారో?"

"అనాథ లాగ నేను వియ్యాలవారికి లొంగిపోతే అప్పు డేమనుకుంటారో?"

"ఇ దెక్కడి అభిమాన మండీ?"

"బజార్లో దొరికే రకం కాదిది"

"దొరికినా అక్కర్లేదూ"

"..................."

"పోనీ నోళ్లలో పడండి"

"నువ్వే పడేశావు నన్నిదివరకేను"

"మూశారా?"

"విన్నావా?"

"..................."

"మాట్లాడవేం?"

"రెండో కొడుకు పెళ్లాంతో కాపరం చేసుకుంటూ వుండడమూ, పెద్దకొడుకు అన్నీ వుండీ కూడా ఘోటక బ్రహ్మచారిలాగ—"

"వాళ్లకి మాత్రం లేదూ ఆలోటూ? రెండో కూతురు లక్షణంగా కాపరం చేసుకుంటూ వుండడమూ, పెద్దకూతురు మొగుడు విడిచిపెట్టేసిన దానిలాగ—"

"చాల్లెండి నేర్చుకు పోయారు"

"లాఘవష్టాలు నీ కేం తెలుసునూ? భారత భాగవతాలికి అర్థం కూడా చెబుతావు, మళ్లీ నీ. కాని వోనమాలు రాని వియ్యపురాలు నయం నీకంటేను"

"ఏమిటో ఆనయం?"

"అలా అడిగావు, బాగుంది. విను మరి. ఈ పట్టుదల అంతా రాజమ్మ దంటున్నారు కాని సుందరప్ప దనడం లేదు యెవరూను"

"అయితే?"

"వాడు నిర్భయంగానే తల యెత్తుకు తిరుగుతున్నాడు వీధిలోను"

"తిరిగితే?"

"ఆడది యింటోనే వుండిపోయాది కనక వీధిలో యెవ ళ్లే మనుకున్నా లెక్క లేదు. మొగాడు నలుగురిలోకీ వెడతాడు కనక భారం అంతా ఆడది తనమీద వేసుకుంటే—"

"బాగుంది ఆలోచన. మంచి మాటే! ఇప్పటికే ఆడాళ్లంతా నన్ను పీకేస్తున్నారు"

"రాజమ్మ నెవరూ యేమీ అనరేం?"

"మీరు వింటున్నారా?"

"అంటే మరి మన కిచ్చేది యిచ్చెయ్యదేం?"

"మెంండి కత్తినవాళ్ల నెవ ళ్లేం చెయ్యగలరూ?"

"నువ్వు బండ కత్తు"

"అడుక్కు తిన్న ట్టుంటుంది"

"..................."

"అయితే నా మాట వినరూ?"

"నువ్వు చెప్పిం దేదీ?"

"మనకి కట్నాలూ వద్దు, కానుకలూ వద్దు. అబ్బాయి పెద్ద చదువులు చదివాడు. నెలకి నూరు రూపాయలు తెచ్చుకుంటున్నాడు. మన దేవాహోహో అన్న సంసారం కాని మరోటి కాదు. ఏం లోటూ? వొకళ్లు పెట్టలే దనీ, పొయ్యలేదనీ మనకి బెంగెందుకూ?"

"..................."

"..................."

"తేల్చెయ్యి తొరగాను"

"మన కేమీ వొద్దు. పిల్లని తీసుకువచ్చి కార్యం చేసేసి యిద్దర్నీ చెన్నాపట్టం పంపెయ్యండి"

"ఏడిసిన ట్టుంది నీ సలహా"

"..................."

"ఇక మొత్తుకోడం వొక్కటే తరవాయి"

"..................."

"మొగుణ్ణి వీధిలో పెట్టిన పీనుగువు, నిన్ను సలహా అడగడం యేమిటి కాకపోతేను?"

"ఇక పరువుకీ, ప్రతిష్ఠకీ నీళ్లు వొదులుకున్నట్టే?"

"పట్టుదల నెగ్గించుకోలేకపోతే యిక పరువంటే యేమిటి, ప్రతిష్ఠ అంటే యేమిటి?"

"వియ్యపురాలితో సమం అవుతారా?"

"తీసిపొమ్మంటావా?"

"ఇంకా యిద్దరు మొగపిల్లలికీ, యిద్దరు ఆడపిల్లలికీ పెళ్లిళ్లూ పేరంటాలూ చెసుకోవాలికూడాను. ఇలా అయితే వాళ్లకి మంచి సమ్మంధాలు తేగలమా?"

"ఇప్పుడీ కట్నపు భూమి వొదులుకుని తెల్లమొఘం వేస్తే తరవాత మూడోవాడికీ, నాలుగోవాడికీ కట్నాలు తేగలమా?"

"ముందు పుచ్చుకునే తర్లి వెడదాం"

"ఇవ్వడం అంటూ వుంటేనా?"

"వులకం!"

"..................."

"కాకపోయినా, వీధిలోకి వెళ్ళే మొగ మనిషికి పట్టూ విడుపూ వుంటాయి. ఆడదానికంటే కనిష్టం అయితే యింకేమిటీ చెయ్యడం?"

"..................."

"మాట్లాడక నన్నేం వుద్ధరిస్తారా యేమిటి?"

"..................."

"మీకు తగిన వియ్యపురాలు దొరికింది. అనుభవించండి"

"..................."

"నాదగ్గిర కోతలు కొయ్యడం కాదు ప్రయోజకత్వం"

"..................."

"ఆ యాభై సెంట్ల భూమీ వియ్యాలవారి దగ్గిర్నుంచి పుచ్చుకో గలిగితే—ఈకళ్ల కీ రెప్పలు దూరం కావు"

"..................."

"తల్లి పెంకితనానికి అక్కడ అ దెంత యేడుస్తోందో, మీ పట్టుదలకి యిక్కడ అబ్బాయి యేం రుసరుస లాడుతున్నాడో—నాకేం?"

"..................."

"మీ యిష్టం వచ్చినట్టు చేసుకోండి. ఇక యీ వూసెత్తితే ఛీ అనండి నన్ను"

"రక్షించావు. మాటిమాటికీ యిక నన్ను వేపుకు తినక ఆమాటమీద వుండు"

౨

"పోనీ అదలా వుంచు. వియ్యపురాలికీ ఆడపడుచులికీ యివ్వవలసిన లాంఛనాల బాపతు మూడు వందల నలభై యెనిమిది రూపాయలూ యిచ్చేస్తే వాళ్లు యివాళ పిల్లని తీసుకుపోతారు. దీని కేం చెబుతావురా?"

"అదీ వొక దారే"

"అదేం దారండీ గోదారీ? దీక్షితు లన్నయ్యా! ఈపుణ్యమాయిం పెవరి దయ్యా?"

"ఎవరి దయితే నీ కెందుకూ?"

"ఇక చెప్పనక్కర్లేదు. తెలిసే పోయింది. వియ్యపురా లెంత యెత్తు యెత్తిందో చూశారుటండీ? ఈవంక పన్ని ముందు తనకీ, తన కూతుళ్లకీ రావలసింది మెల్లిగా లాక్కుంటుంది. తరవాత పిల్లని తీసుకు వెళ్ళి కొడుకు నుసికొలుపుతుంది. ఇక పిల్లని, మనల్నీ మూడు చెరువుల నీళ్లు తాగిస్తాడా అబ్బాయి! అబ్బో! ఎంత నెరజాణ అయింది వదినా?"

"పాపం ఆవిడ నాతో మాట్లాడనే లేదు యేమీని"

"ఆవిడ నీతో ఎందుకు మాట్లాడాలీ? నేనా యేమిటి వచ్చీ దేమిటో పోయీ దేమిటో ఆలోచించుకోకుండా వడవడ వాగడానికి? మొగుడికి పాఠం చెప్పింది. యేమీ యెరగనట్టు తను అంతఃపురంలో కూచుంది బూబమ్మ లాగ"

"జానకమ్మ నేమన్నా పాపం చుట్టుకుంటుంది"

"అలాగటండీ? పెత్తాత మనమరా లయినందుకు బాగానే వూసుకు వచ్చారు పాపం; అయితే, మీకే గాని ఆవిడకి లే దిలాంటి అభిమానం యెప్పుడూనూ; పోనీ గాని, దీక్షితు లన్నయ్యా! లాంఛనాల సొమ్మిచ్చేస్తే యివాళ పిల్లని తీసుకుపోతారన్నావు గదా? అంటే యే మన్నమాటయ్యా?"

"దాన్లో తెలవం దేం వుందీ?"

"తరవాయి మా టేమిటీ? కొంచెం చెబుదూ"

"అంటే?"

"రాకపోకలూ—"

"నేను వూచీ పడలేను"

"అయితే వల్లకాదు"

"ఇలా అట్టే పెట్టుకుంటావా?"

"ఎటు చూసినా చిక్కే వచ్చిం దయ్యా నాకూ. ఇక్కడ పిల్ల గోల పట్టలేకుండా వున్నాను. అక్కడ వారు పట్టు విడవకుండా వున్నారు. తప్పెవరిదో తెలుసుకోకుండా వూళ్లో అమ్మలక్క లందరూ నన్నాడిపోసుకుంటున్నారు చాటునా మాటునానూ"

"నువ్వు మాత్రం పట్టు విడిచిపెట్టావా?"

"వారి కిస్తా మన్నది యివ్వ మన్నాముటయ్యా?"

"ఏమిస్తా నన్నావు, యేమిచ్చావు? ఇచ్చేస్తే యీ తగువు లెందుకూ?"

"యకరమే కాదూ—"

"నీ మొగుడు యకరం నర యిస్తా నన్నాట్ట. ఏమిరా, యిస్తా నన్నావా లేదా?"

"అన్నమాట నిజమే"

"ఆయన మాట లెక్కేమిటయ్యా అంటే మాత్రం? ఆయన కేం తెలుసునూ? వాళ్లెంత అడిగితే అంతా యివ్వవలసిందే?"

"మొదటి తప్పు మీదీ, తరవాతి తప్పు వాళ్లదీనీ. ఉభయులూ పేచీలకే సిద్ధపడ్డారు"

"మే మేం సిద్ధపడ్డామూ? ఇచ్చెయ్యడానికిప్పటికీ సిద్ధమే కాదూ?"

"చిన్న కూతురి కెక్కువ యిచ్చి పెద్ద కూతురికి తక్కువ యివ్వడం యేం సబబూ?"

"వాళ్లు వొప్పుకో లేసుటయ్యా మొదటూ?"

"అస లేం జరిగిందిరా? బాగా చెప్పు నీ పెళ్లాం మొదటూ"

"పెద్ద పిల్లకి యకరం భూమి యిస్తా నన్నాను. వియ్యపురాలి కో నూటపదహార్లూ, ఆడపడుచుల కిద్దరికీ చెరో నూటపదహార్లూ—"

"వందవంద కంటే యెక్కువ యివ్వడానికి వల్లకా దంటే పైపదహార్లు మీ బావ పెట్టారు. యాభై రూపాయలు–మాటలా?"

"వాణ్ణి పూర్తిగా చెప్పనియ్యి"

"దానికి వాళ్లంగీకరించారు; కాని తరవాత చిన్నపిల్లకి యకరంనర యివ్వవలసివచ్చింది. దాంతో పేచీ వచ్చింది"

"ఎప్పుడు వచ్చిందీ?"

"పెళ్లి వారం వుం దనగానూ"

"వస్తే?"

"మాక్కూడా అలా యిస్తే కాని వల్లకా దని జోగన్న కబు రంపాడు. అందుకు మా మామగారు మాట్లాడకుండా వొప్పుకోమన్నారు"

"వొప్పుకున్నావు"

"అవును"

"తరవాతా?"

"తరవాత మా మామగారు యకరమే రాయించి పరమరహస్యంగా రిజస్ట్రీ చేయించారు. మూఢు ముళ్ళూ పడ్డ తరవాత కట్నం చదివినప్పుడు వాడ దేమిటన్నాడు. అంటే, మొదట అంతే వొప్పుకున్న మన్నారు మా మామగారు"

"అంటే?"

"ఇం కేం వుందీ? పెళ్లివారు వొక్క పూటయినా భోజనాలికి రాలేదు. పెళ్ళికొడుకు కూడా యే వొకటి రెండు మాట్లో తప్ప మా యింటో భోజనం చెయ్యలేదు. అగ్నిహోత్రాలూ, జరగవలసిన తంతూ మాత్రం—ను వ్యరగండా యేమిటి అదంతాను?"

"వొక వూరేగింపా, వొక నలుగులా, వొక బంతులాడింపా, వొక సదస్యమా—యేం ముచ్చట్లు తీరాయి అన్నయ్యా మాకూ? చిన్నపిల్లకి అన్నీ జరుగుతూ వుంటే పెద్దపిల్ల యింట్లో యేడుస్తూ—"

"అంత అల్లరి కేనా వొప్పుకున్నావు; గాని అన్న యాభై సెంట్లూ యివ్వ లిచ్చావు కాదు నువ్వు. నీదీ శక్తి అంటేను"

"యాభై కాదు, వొక్క సెంటివ్వనివ్వను. నాకు పిసాళం యెత్తుక వచ్చిం దంటే ఆలాంఛనాల సొమ్ము కూడా యెగబెట్టిస్తాను. నాపిల్ల నాకు పెద్దకొడుకు కనుకుంటాను"

"కాని ఆపెద్దకొడుక్కి పెళ్ళాన్ని మాత్రం తెచ్చిపెట్టవు. కదూ?"

"పెట్టి పుట్టందే యెలా వస్తాయీ సుఖాలూ, అందాలూనూ? చిన్నపిల్ల యేణ్ణర్ధంనుంచి చిలక లాగ కాపరం చేసుకుంటోంది. పెద్దదాని కర్మం కాకపోతే యిదేమిటీ!"

"ఇంతకీ మీరు మెట్టు దిగకపోతే నీ కూతురికే చిక్కు. మీకే అప్రతిష్ఠ"

"వాళ్లెందుకు దిగరూ?"

"దిగారు కారూ? లాంఛనాల సొమ్మిచ్చేస్తే పిల్లని తీసుకుపోడానికి సిద్ధంగా వుంటేనే వాళ్లు?"

"రాకపోక లుండవని నువ్వే చెబుతూ మళ్ళీ దిగారు దిగా రంటా వేమిటయ్యా?"

"మీ కంటే దిగారు"

"పెళ్ళిలో ముచ్చట్లూ లేవు, వల్లకాడూ లేదు, యిప్పుడేనా లేకుండా—"

,,అంటే?,,

"నలుగురూ బిలబిల్లాడుతూ రావడమూ, సలక్షణంగా కార్యం చేసుకోడమూ, పిల్లని పంపుతూ వుండడమూ, అల్లుడువస్తూ వెళుతూ వుండడమూ—"

"ఇక అవేమీ జాంతేనై. కార్యానిక్కూడా యిక్కడికి రారు. పిల్లనేనా కట్టుగుడ్డలతో పంపెయ్యాలి. ఏమీ—పసుపూ కుంకుమా—"

"అలా వొక్కనాటికి జరగదు. నా పిల్ల నా యింటోనే వుంటుంది. కన్నవాళ్లం పోషించలేమా యేమిటి దాన్ని?"

"................"

"ఇలాంటి రాయబారం యెలా తెచ్చావన్నయ్యా నువ్వూ?"

"ఏమంటావురా?"

"ఆయ న్నడిగీ దేమిటయ్యా? ఆయ నేం చెప్పగలరూ? చుట్ట కాలుస్తూ, కారాకిల్లీ నములుకుంటూ చీట్లాటలో కూచోడమే; గాని వొక్క దమ్మిడీ తేలేరు. ఇస్తానసరూ ఆయనా? ఆయన లెక్కేమిటీ? వాళ్లడిగిందల్లా అడిగినంతా యిచ్చి మొగపిల్లల్ని పాడుచేసుకోమా?"

"అయితే యిక నేను వెళ్లిపోతాను. ఇంక రెండు నిమిషాలు గడువు. ఈ లోపుగా నేను వెళ్లి ఆపుచెయ్యకపోతే నీ అల్లుడు వెళ్ళిపోతాడు. జట్కాలో సామాను వేయించుకొని యెక్కడానికి సిద్ధంగా వున్నాడు వాడు. మీరు రాజీకి అంగీకరిసే వారంరోజు లుండి, కార్యం చేసుకుని మీ పిల్లనీ కూడా తీసుకుపోతాడు"

"అంత చెప్పల్లో కాళ్లుంచుకొని మాట్లాడితే తేలీదిట్రా యిదీ?"

"రాజీపడ్డా పిల్లని వూళ్లో వుంచడూ? అయితే పొమ్మను. చెన్నాపట్టం వెళ్ళినా సరే శ్రీకాకోళం వెళ్ళినా సరే యింకా"

"................"

"అబ్బో! ఇలాంటి యెత్తు వేశారూ వియ్యాలవారూ? మహా బాగుంది. ఇక ఆ యాభైసెంట్లే కాదు. లాంఛనాల బాపతు పై పదవేళ్లుకూడా యివ్వనివ్వను"

"అస లంతా యివ్వనివ్వకపోతే మాత్రం యేమీ?"

"అయితే మూడో మేలు. సొమ్ము చేదా యేమిటి మాకు?"

"పిల్లల సుఖం చేదు; గాని సొమ్ము చేదు కాదు మీకు"

"ఇంచేతే నిన్ను చూస్తే నాకు—ఏమనుకున్నావ్?"

"ఏం?"

"వాళ్లు తిన్నసైన వాళ్ళా?"

"అక్కడ నే నెంత దెబ్బలాడివచ్చానో యెరుగుదువా నువ్వు?"

"................"

"పెత్తనాలకా యేమిటే బయలుదేరావూ?"

"కాదే?"

"మ రెక్కడికీ?"

"................"

"మాట్లాడ వ్వేమే?"

"ఎందుకే?"

"పో, పో. పిన్నిగా రింటికి మాత్రం రోజూ యెందుకూ?"

"పోతున్నాను"

"................"

"................"

"పోవేం?"

"పోతూంటేనే?"

"..................."

"వీధిలో జట్కా ఆగినట్టుం దెవరి దన్నయ్యా?"

"చుట్టాలో స్నేహితులో మరి"

"వెళ్ళి చూడండీ యెవరోనూ?"

"గుమ్మంలోకి వచ్చినవారు లోపలికి రారా రేమిటి?"

"..................."

"యెవర్రా?"

"చె—ప్తా"

"..................."

"నీ అల్లుడే కోయ్!"

"లోపలికి పోవే. వెళ్లి పోవే. పోవేమే?"

"..................."

"నీ కెవరు కావాలి? మీ అమ్మా నేనా?"

"మీరే"

"అయితే నాతో వచ్చెసెయ్యి"

"పదండి"

"..................."

"ఎక్కడికే?—ఎక్కడికే?— రయిల్లు వల్ల కాదు—వెనక్కి మళ్లుతావా మళ్ళవే?"

"..................."

"చూసా రేమండీ? బందిపోటు దొంగలాగ పట్టపగలు వచ్చి పిల్ల నలా లాక్కుపోతూ వుంటే నిర్ఘాంతపడి అలా వూరుకుంటా రేమండీ?"

"..................."

"బెల్లం కొట్టిన రాయిలాగ మాట్లాడ రేమండీ"

"అయ్యో, అయ్యో! బండి కదిలింది వెళ్ళి పోతోంది. మేఘాలమీద యెగిరిపోతోంది. నువ్వే నా అడ్డుకున్నావు కాదేమి టన్నయ్యా?"

"మొగుణ్ణి పెళ్లాన్ని విడతియ్య మంటావా?"

"నిన్ననడం యెందుకూ నా వస్తువు మంచిదైతేనూ? ఎక్కడ యేడ్చిపోతుందో అని వెయ్యి విధాల—అందర్నీ వొక యెత్తునా దాన్ని వొక యెత్తునా చూస్తూ వుంటే యెంతపని చేసిందీ విశ్వాసఘాతుకురాలు!"

"..................."

"ఇందుకే ఆడాళ్లకి పెట్టడం అంటే నాకు తల నొప్పి"

"చిన్నదానికి పెట్టడం మానేశావా?"

"అది యిలాగే చేసిందా?"

"మీరుమాత్రం దాన్ని యిలాగే చూశారా?"

"పోవయ్యా నేర్చుకున్నావు మాటలూ? ఇక దాన్ని నా యింటికి రానిస్తానా యెప్పుడేనా?"

"వుండగలవా?"

"కరా పట్టా నంటే నా సంగతి నీకు తెలవదు. చూస్తూ వుండు దాని మొఖు మేనా చూస్తా నేమో యింక"

"ఊకఖుర్ల కేం లే? మళ్లీ ఈరోజుల్లో నువ్వు చెన్నపట్నం బయలుదేరకపోతే నా చెవి తెగ్గోయించుకుంటాను"

"ఎందు కమ్మా?"

"కూతురికి పురుడు పొయ్యడానికి"

"భాల్లేకయ్యా"

"అలాగే నమ్మా? ఇప్పు డలాగే వుంటుంది. "ఏమయ్యా, అన్నయ్యా! మీ బావకి తీరుబడి లేకపోతే నువ్వైనా కాస్త సాయం కాగూడదు టయ్యా? పిల్ల యెంత కష్టపడుతోందో నయ్యా చేసుకోలేకా. ఎనిమిదో నెల వెళ్లవచ్చిం దయ్యా పాపం! రావయ్యా! నన్నక్కడ దింపేసి—క్షణం వుండవద్దయ్యా అక్కడ నువ్వూ. ఆరాత్రి మెయిలుకే వచ్చెస్తువుగా నయ్యా" అని అప్పుడు నన్ను చేతులూ కాళ్లూ పట్టుకు బతిమాలకపోతే—"

"అంత బేలపీనుగు ననుకున్నావు టయ్యా నన్నూ?"

"ఆకాశా న్నుంచి వూడిపడ్డావా యేమిటి నువ్వు మాత్రం?

"ఇం కెందుకూ? అయిం దేదో అయిపోయింది,

ముందు సంగతి ముందు చూసుకుందాం. ఇప్పటి కింతటితో వూరుకోండి గప్చిప్పుగా"

"మిమ్మల్ని చూస్తే వొళ్లు మండిపోతోందినాకు. మళ్లీ మాట్లాడా రంటే మాట దక్కదు. ఇప్పుడా వేళాకోళాలూ, వెక్కిరింతలూనూ?"

"వొరే బావా, నువ్వవతలికి పోరా కాస్సేపు"

"బతికించావు"

3

"చెల్లీ!"

"ఎం—దు—క—న్న—య్యా?"

"ఆ దేమిటమ్మా? శుభ మల్లే కూతురు తన మొగుడితో వెళ్లడం యేమిటి, నువ్వు కళ్లల్లో నీళ్లు పెట్టుకోడం యేమిటి? తప్పు, తప్పు, వూరుకో, వూరుకో"

"ఎం—త—ప—ని—జ—రి—గిం—ద—య్యా?"

"ఎప్పు డేది యెలా జరుగుతుందో మన కేం తెలుస్తుం దమ్మా?...అయినా యిదేనా బాగానే వుంది. నీ తప్పు నీ కూతురు దిద్దేసింది"

"కనిపెట్టలేకపోయా నయ్యా దాని తపనా! యెంత యిదీ కాకపోతే కార్యం కాకుండా మొగుడితో లేచిపోతుంది టయ్యా అయిన యింటి పడుచూ?"

"నిజమే"

"ఎంత బలగం వుందయ్యా దానికీ? గుమ్మానికి తోరణం కట్టుకున్నా మంటే వంద మందికి తక్కువ వస్తారుటయ్యా నాయింటికి చుట్టాలూ? అలాంటిది యెవళ్లూ రాకుండా—చివరికి తల్లిపీను గేనా దగ్గర లేకుండా—యెంత వుసూరు మంటుందో నోయ్ వెర్రిపిల్లా!"

"................"

"వొక తలంటు లేకుండా, వొక కాళ్లు కడగడం లేకుండా—కాసికి మంగళహార తేనా లేకుండా అయ్యో! ఇంటికి పెద్దాడబడుచోయి తండ్రీ!"

,,అవును మరి. నిజమే; కాని దాటిపోయాక యేం చేస్తామూ?"

"ఇహ నే నుండలే నోయ్! నన్ను కూడా చెన్నాపట్టం తీసుకువెళ్లవూ? వూరుకుంటా వేమయ్యా"

"సంవత్సరాని కొక్కని కలగ దనుకున్న తోం దర నీ కివాళే—ఈక్షణంలో నే కలుగుతోంది"

"ఇంకా "కలుగుతోం" దేమిటి కలిగిం దయ్యా! నాతండ్రివి కాదూ? తీసుకు వెళ్లవూ?"

"నే నో మాట చెబుతాను వింటావా?"

"ఏమి టన్నయ్యా అదీ?"

"నీకు కోపం వద్దు"

"ఇం కెక్కడి కోప మయ్యా కడుపు తరుక్కు పోతూ వుంటేనూ?"

"కాని, యిప్పుడు వెడితే నువ్వు లోకువై పోతావు"

"ఆడపిల్ల యెప్పుడు పుట్టిందో అప్పుడే లోకువై పోయాను, యిప్పుడు వచ్చిన విశేషం యేమిటయ్యా?"

"నిజంగా?"

"పుండు మీద కారం చల్లుతావా అన్నయ్యా?"

"నే నలాంటి వాణ్ణే?"

"కాదు, కాదు. నిన్నెరగనూ నేనూ? దిక్కుమాలిన కర్మం తిక్క వస్తే తిప్పుకో లే నయ్యా నేనూ! అందుకు తగిన శాస్తి చేశా డయ్యా దేవుడూ"

"................"

"మాటాడ వేమయ్యా?"

"నా కేమీ తోచడం లే దమ్మా"

"నీకు తోచకపోతే నేను చెబుతాను విన వయ్యా"

"విని యేమిటి చెయ్యడం? నీ అల్లుడు వెనక్కి రాడు. నీ కూతుర్ని కూడా రానివ్వడు. అసలతను రానివ్వడం దాకా యెందుకూ, అదే రాదూ"

"వాళ్లు రావడం యెందు కయ్యా? మనమే వెడదాం అక్కడికి"

"వెడితే మాట్లాడకపోతే—"

"నాకూతు రలాంటిది కాదోయ్!"

"వాడు?"

"పాపం మాట లెందుకూ? అత నేనా చాలా వోపిక కలవాడు; కాని తొందర మనిషి కాడు"

"నవ్వు వస్తోంది నాకు"

"ఏం"

"ఇప్పుడే కాదు టమ్మా బందిపోటుదొం గన్నావు?"

"వొళ్లు తెలవనప్పు డన్నా నామాట. ఇప్పుడు మణిపూస అని తోస్తోంది. కాకపోతే నా కూతుర్ని విడిచిపెట్టేసి మరొక పిల్లని—పిల్లలు దొరకరు టయ్యా అతగాడికి? కురూపా, చదువు లేని వాడా, చేతగానివాడా?"

"అలాంటివాడికి యెంత అయాసం కలిగించావో యిప్పుడేనా తెలుస్తోందా?"

"................."

"ఇక నే నక్కసు్స పట్టలేను. వున్నమాట వున్న ట్టనేస్తాను"

"అనే సెయ్యి"

"ఇక్కడ నువ్వూ అక్కడ జోగన్నా చేశారిదంతాను"

"వియ్యపురాలు—"

"దా న్నన్న వాళ్లు పురుగు లోడి—"

"ఏం?"

"కట్నం కోసం పట్టు పట్టవద్దని, తనూ, పిల్లలూ లాంఛనాలు వొదులుకుంటా మని అపవాదలు పుడితే తీసేసుకో లే మని, కార్యం చేసేసి కోడల్ని తీసుకు రమ్మని శతవిధాల పోరుతోం దది రోజూనూ; కాని జోగన్నే—"

"నిజం గాను టయ్యా?"

"చివరికి కొడుక్కి యీ వుపాయం చెప్పింది కూడా అదే అనుకుంటాను నేను"

"చూశావా? ఇంత కంటే దారి కనపడ లేదా యిల్లాలికి పాపం; కాని అవి జ్ఞానంలేని మాట లన్నానయ్యా నేనూ?"

"దాన్ని పూసుకువచ్చా డని యిందాకా నీ మొగుణ్ణి కూడా యీసడించావు—"

"ఎంత పాపానికి వొడికట్టా నయ్యా నేనూ? ఇక దెలా పోతుం దయ్యా?"

"నువ్వే ఆలోచించు"

"వదిన కాళ్లమీద పడితే?"

"అ దొక దారి"

"మరో దా రెందుకూ యింకా? ఆవిడికి పెద్ద కొడుకూ నాకు పెద్దకూతురునూ. ఇద్దరూ దిక్కులేనివాళ్లలాగ యెక్కడో చెన్నాపట్నంలో—"

"వాళ్లు కూడా యేదో పాపం చేసుకున్నారేమో వెనకటి జన్మలో?"

"మా కడుపుల్లో పుట్టడమే వాళ్లు చేసుకున్న పాపం. అన్నయ్యా! ఇక నేను నిలవలేను. నా నరాలు పట్టు తప్పిపోతున్నాయి. ముందు నన్ను తీసుకువెళ్లి జానకమ్మ వదిన కాళ్లమీద పడెయ్యవయ్యా"

"................."

"నాకు లేకుండా చేసుకోవడమే కాకుండా ఆవిడక్కూడా యీముచ్చట లేకుండా చేశాను నేను. పద వయ్యా బతిమాలి ఆవిణ్ణీ పిల్లల్నీ కూడా తీసుకు వెడదామూ"

"ఈలోపునే—రేపు రాసిన ముహూర్తంవుంది. నీకూతురుకీ అల్లుడికీ తారాబలం కుదిరిం దేమో కూడానూ"

"అయ్యో, అయ్యో ఏం తొందర పడతారో యేమిటో?"

"వా డలాగ తొందరపడే వాడు కాడు. నీ కూతురే యేమేనా—"

"నన్ను సూదులతో పొడవక తంతి కొట్టెయ్యవయ్యా వెళ్లి. నాతండ్రివి కాదూ? నా నాయనవు కాదూ?"

"వెడతాను లే"

"ముందు వెళ్లాలి. అయితే మనం యెప్పుడూ వెళ్లడం?"

"నీకూతురూ అల్లుడూ వొంటిగంట పాసెంజరులో వెడుతున్నారు; మన మంతా రాత్రి మెయి

లుకి వెడదాం. వాళ్లు పదిన్నరకి గాని చెన్నపట్నం వెళ్లలేరు. మనం యెనిమిదిన్నరకే వెడతాం. వెంటనే నేను బజారుకి వెళ్లి గంపెడు పూలదండలు తెస్తాను. రైలు దిగేటప్పటికి యెదురుగా వెళ్లి నీ కూతురుకీ అల్లుడికీ మెడ తిరక్కుండా అంతా తలో దండా వేద్దాం”

“ఏడుస్తూ వున్న దాన్ని నవ్విస్తా వోయ్ నువ్వు?”

“అయితే మంచిదే కాదూ?”

“మనం అలా చేస్తే నా వెర్రితల్లి యెంత సిగ్గుపడుతుందో పాపం!”

“అది సిగ్గున్న మనిషే అయితే పట్టపగలు లేచిపోతుంది టమ్మా?”

,,మేనగోడల్ని నువ్వేమన్నా అనతగ్గవాడవే. నువ్వు చేసే వుపకారానికి—.”

“ఇంతకీ వారుకూడా రావాలి కదా?”

“మావదిన వస్తుం దయ్యా! ఆవిడ అలాంటి పెంకి మనిషి కాదు పాపం! కాళ్లమీద పడి నేను బతిమాలుకుంటాను కాదూ? తతిమ్మా ఘోర్పా టంతా నువ్వు చేస్తూ తొరగానూ”

“అన్నకొడికి యిచ్చెయ్యకుండా వాళ్లు—”

“ఇంకెందుకూ? యకరంనర భూమీ, మూడు వందల నలభై యెనిమిది రూపాయలూ, వాటి కైన ఫాయిదా—”

“అదిగదీ మాట”

“నాకు తెలవ దనుకున్నావా యేమి టయ్యా మంచీ చెడ్డానూ?”

“తీరా అంతా సిద్ధ మైనాక మీనాన్న—”

“వూరికే పేరు మట్టుకి మానాన్న ది; కాని—”

“ఇదంతా నువ్వే చేస్తా?”

“దెప్పిపొడుస్తావా అన్నయ్యా?”

“లే దమ్మా లేదు, వూరికే తెలుసుకోడానికి—”

,,తరవాత చెబుతా కాదూ అదంతానూ? ఇదిగో నేను వెళ్లి మా వదిన్ని బతిమాలుకుంటున్నాను. మీబావతో చెప్పి ప్రయాణం సిద్ధం చేయించు నువ్వు. పాలికాపుని రాయారం పంపి జట్కాలు తెప్పించ మను ముందు”

,,నుంచున్న పళంగా యింత యెత్తు యెత్తే యింత డబ్బు తేగలనా అంటాడేమో బావ?”

,,నిన్న రాత్రే నయ్యా వొక రయితు తెచ్చి పదిహేను వందల యెనభై రూపాయలు గుమ్మరించాడు. వాకట్లోనూ. అవన్నీ ఖర్చుపెట్టేస్తా నిప్పుడు. వెళ్లేది చెన్నాపట్టం కనక అక్కడ ముద్దినుసు వస్తువులూ దొరుకుతాయి యించక్క—”

,,.....................”

,,నవ్వు వస్తోందా అన్నయ్యా?”

,,లే దమ్మా లేదు”

,,నవ్వితే నవ్వావు; గాని, యిదంతా చేసిపెడితివా మళ్లీ జన్మలో నీ కడుపున పుడతాను”

,,ఇప్పుడు మాత్రం నాకు నువ్వు తక్కువ దానవా యేమిటి?”

,,అవు నవును. నీ కలాంటి దయ వుంది కనక నా కిప్పు డిలాంటి సాయం చేసున్నావు నువ్వు.”

,,ఇదీ వొక దయలోనే లెక్కా?”

,,అదంతా తరవాత మాట్లాడుకుందాం. పండుగ పేరు చెప్పి రావడంచేత సమయానికి మాపిల్లలూ, వారి పిల్లలూ కూడా యిక్కడే వున్నారు కంగారు అక్కల్లేకుండానూ. ఇదిగో! సుందరమ్మ వొదిన్నీ పిల్లల్నీ కూడా తీసుకురాకపోతే నేను వొప్పుకోను సుమా”

,,.....................”

, మాట్లాడ—తీసుకు వస్తా నన వేమయ్యా మరీ?”

,,నీది వెర్రీ కాదు, వేషమూ కాదూ”

,,అదంతా నాకు తెలవదు—”

,,ఇదంతా తలుచుకుంటే యెంత ఖర్చవుతుందో—”

,,సమయం వస్తే వెనక్కి తీస్తానటయ్యా! ఇంతకీ వుభయఖర్చులూ నేనే పెట్టుకుంటానుసుమా,,

,,అయినా, వాళ్లు కూడా యెందు కమ్మా యిప్పుడూ?,,

,,పెళ్లి ముచ్చట్లూ, శోభనపు ముచ్చట్లూ వొక్కమాటే తీరాలి కాదు టయ్యా మరీ?,,

తెలుగువారి దేశభాషాభిమానం

ఉభయభాషా—సాహిత్యవిద్యా—ప్రవీణ బులుసు వేంకటరమణయ్యగారు

దేశభాషలు అభివృద్ధి పొందా లంటే నవ్యత అనేది ఉండి తీరా లని యిప్పటి చాలామంది నమ్మకం. నవ్యత అనే దానికి గిరాకీ జాస్తీ అయి, చెలామణీ యెక్కువగా అవడం సర్వత్రా కనబడుతూనే ఉంది. ఒక భాషావిషయంలోనే కాదు, మన జీవితానికి—నాగరకతకీ సంబంధించిన ప్రతి విషయానను నవ్యత యొక్క బావుటా ఎరుగుతూనే ఉంది. అప్పుడు పుట్టిన బిడ్డ లగాయితూ అరువొన్నొకటో పడి దాటిన వారి వరకూ—అందరికీ దాని మీదే కోరిక—వేలంవెర్రి. కొత్త వింతా పాత రోతానూ. నవ్యత గారిలా ఏకచ్ఛత్రాధిపత్యంగా రాజ్యమేలుతూ వున్నందున—అది లేకపోయినా, దాని పేరెత్తిన మాత్రాన—అట్టి వారిదే సభాతాంబూలం. ఏదేనా పదార్థం తనలో నవ్యత ఉన్నట్టు నటిస్తే చాలు బ్రహ్మరథం పట్టేస్తుంది లోకం, అసలు పదార్థంలో పస వున్నా లేకపోయినా అడ్వర్‌టైజుమెంట్ల ధాటి చూసి టోపీలో పడటం.

ఈ నవ్యత—అనగా క్రొత్తదనం—అనేది వేషాల్లోకీ భాషల్లోకీ ప్రవేశించి క్రమక్రమంగా వాఙ్మయంలోకి—అంటే గ్రంథాలకి కూడా ఎక్కడం ప్రారంభించింది. అలా ప్రారంభించి నలుగురి కళ్లల్లోనూ దుమ్ముగొట్టి నన్నయాదుల గ్రంథాలకి నామంపెట్టేసి నాయుడుబావ పదాలకి ప్రాముఖ్యం యిప్పించింది. పది పేజీల గ్రంథానికి వకరూపాయి ఖరీదు పెట్టినా నవ్యత ఉన్నా దనుకొనబడే పుస్తకానికి చెలామణీ వుంది. ఎంత చవగ్గా అమ్మినా ప్రాచీనకవుల గ్రంథాల్ని కొనక "మాకు ఉత్తనే యిచ్చినా వొద్దోయి దేవుడా!" అంటూ ప్రజ మొర్రపెడుతుంది.

మంచి చెడ్డలకీ క్రొత్త పాతలకీ యేమీ సంబంధం లేదు. పాత వన్నీ మంచి వనిన్నీ కొత్త వన్నీ చెడ్డ వనిన్నీ తలంచడం పొరపాటు. కొత్తలోనే భావతత్త్వమంతా యిమిడివున్న దనిన్నీ పాత వాఙ్మయమంతా పనికిమాలిన చెత్త అన్నిన్నీ, శుద్ధాబద్ధ మనిన్నీ అనుకోవడం అంతకన్నా మరీ తప్పు.

"తెలుగు కొందట్నుంచీ సంస్కృతం అనేటటువంటి ఒక డెడ్ లాంగ్వేజి నాధారం చేసుకుని దాని పాదసేవ చేస్తూ జీవితం నిలుపుకుంది. అంచేత దాన్లోలాగే దీన్లో కూడా భావప్రాధాన్యం లేని కవిత్వమూ, కవి స్వేచ్ఛాగానానికి ప్రతిబంధకాలయిన నియమాలూ దాపరించి భాష పాడయిపోయింది స్వయంవ్యక్తిత్వం లేకా" అంటూ ఒకాయన ఉపన్యసిస్తాడు

"కవిత్వంవల్ల అందరికీ రసం కలగాలి, గాని కథ యెవడికి కావాలి? మన ప్రాచీనకావ్యాల్లో కథాప్రాధాన్యం తప్ప భావప్రాధాన్యం యేదీ? ఒకవేళ కొన్ని గ్రంథాల్లో కథ తక్కువై వర్ణన లెక్కువగా వున్నా అవన్నీ అతిశయోక్తులే గాని భావానికి ఉపయోగించేవి కావు. మన ప్రాచీనులు సర్వత్రా కోతలు కోశారే గాని—అందులో స్వభావం కనపడదు. అంచేత నవ్యకవిత్వంలో భావానికి ప్రాధాన్యం యియ్యబడి సహృదయులకి ఆనందం కలిగించడంలో యేమీ అభ్యంతరం లేదు" అంటూ యింకొక పెద్దమనిషి చెప్తాడు.

"కవి అన్నవాడు నాయకుడిలో లీనమయి పోయి తన జీవితాన్ని నాయకుడి జీవితంలో మేళవించి స్పష్టంగా ప్రతిబింబింపచెయ్యాలి. లేకపోతే అది కవిత్వమేమిటి? అంటూ మరొకాయన లెక్చరిస్తాడు.

"మనవాళ్ల దృష్టంతా రాజులూ, రాజ్యాలూ, ఉద్యానాలూ యేనుగులూ, గుర్రాలూ మొదలైన వాటిమీదనే పోయింది. గ్రంథాల్లో కూడా—సంఘంలో మల్లే, తక్కువ జాతుల వారినీ, బీదవారినీ, అడుక్కి తొక్కేసి అన్యాయం చేశారు.

లోచించి చూస్తే వాళ్ల జీవితాలే ఆదర్శప్రాయాలు. ఆనందమయాలు. ధన్యాలున్నూ. నవ్యకవితలో నిష్పక్షపాతంగా, వాళ్లకి చేయబడిన అన్యాయాన్ని పూర్తిగా నాశనం చేయడానికి సంకల్పించాము'' అంటూ ఒక మహానుభావుడు వ్రాస్తున్నాడు.

"ఆడా మొగా భేదం లేకుండా చిన్నా పెద్దా భేదం లేకుండా ఎక్కువ తక్కువ భేదం లేకుండా అందరికీ సరిసమాన మయిన హక్కు యివ్వడమే మా అభిప్రాయం. విశ్వప్రేమ మా ఉదారాశయాల్లో ముఖ్యం. జగత్తంతా ప్రేమమయ మైపోవాలి'' అంటూ యింకో ఆయన వాదన.

"అన్ని విధాలా సంస్కృతాన్నే పట్టుకు దేవులాడి అఖండన్నులే అప్పు తెచ్చుకొని పద్యాలు వ్రాస్తే తెలుగు ప్రత్యేకతా, జాతీయతా తెల్లవారినట్లే. అంచేత యిప్పుడు తెలుక్కి కొంత విశ్వామిత్రసృష్టి అవసరం వచ్చింది గనక ముత్యాల సరాలూ, స్వేచ్ఛాగానములూ, గేయాలూ వ్రాసి విశాలహృదయం గల కవి స్వేచ్ఛగా ప్రకృతిని గానం చేయడానికి అవకాశాలు కల్పిస్తున్నా''మంటూ ఒక వాఙ్మయోద్ధారకధురంధరుడి అభిప్రాయం.

ఇలాగ ఒక మూలనుంచి కొత్త గోదావరి వచ్చినట్టు కొత్త వాఙ్మయం పొంగి వస్తూ వుంటే దాన్ని అడ్డడానికి ప్రయత్నం చేసే భాషోద్ధారకులు కొందరు "నలుగురూ మాట్లాడుతున్న వ్యవహారభాషలో పుస్తకాలు రాస్తే వాఙ్మయం కుక్క ముట్టుకుపోతుంది. అంచేత వ్యాకరణశుద్ధ మైన భాషలోనే పుస్తకాలు వ్రాయించి అచ్చొత్తించి లెదరు బైండు కట్టించి బీర్వాలలో పేర్చా'' లంటూ భీష్మించుకు ఒక మూల కూచున్నారు.

బాగా ఆలోచిస్తే, ఫలానావారి వాదన బాగుంది. ఫలానావారిది బాగు లేదు. అంటూ యిదమిత్థ మని నిశ్చయించడానికి వీలు లేకపోయినా, కొంతవరకేనా ఉన్న సంగతిని బయలుపెట్టడానికి వీలుంది.

అది డెడ్ లాంగ్వేజి కానిండి, మరేమన్నా కానిండి, సంస్కృతమే తెలుక్కి చాలా వరకూ గతి అయిందన్న మాట ఒప్పుకోవలసే వస్తుంది. అమూల్య మైన పుస్తకాలన్నీ సంస్కృతంలోనే వున్నాయి. భావం—రసం ప్రధానం కాని కవిత్వాన్ని సంస్కృతం వారిలో పూర్వీకులు కూడా వప్పుకోనే వొప్పుకోరు. "కథలకోసం కాదు కావ్యాలు రాయడం, రసం కోసమే గాని—'' అంటూ కావ్యతత్వాన్ని వివరించే ఆలంకారికు లందరూ ఘోష పెడుతూనే వున్నారు. సంస్కృతంలోని యీ తత్వాన్ని గ్రహించలేక చాలామంది సంస్కృతాన్ని అనుసరించడం చేతనే తెలుగు పాడైపోయిందని అర్థం లేని అర్భాటం చేస్తారు.

సంస్కృతంలాంటి ఉదారవాఙ్మయాన్ని ఆదర్శంగా ఉంచుకుని కూడా తెలుగువారు ఆమోస్తరుగా భావ-రసప్రధానంగా గ్రంథాలు రచింపలేకపోవడం తెలుగువాళ్ల లోపమే గాని మరొకటి కాదు. తెలుగుకవులు తాము ఆశ్రయించుకున్నవాడిని బట్టి—అతగాడి వంశాలూ తన వంశాలూ అతిశయోక్తులతో నింపి చాటభారతం లాగ గ్రంథాల కెక్కిస్తారు. యిల్లాంటివి సంస్కృతంలో చాల అరుదు. ఇంచుమించుగా పుస్తకాలని అంకితం యిచ్చే పద్ధతి కూడా తెలుగులోనే పుట్టిందని చెప్పవచ్చు. కాళిదాసాదిమహాకవు లెవ్వరూ అంకితాలూ, అతిశయాలూ షష్ట్యంతాలూ—సప్తమ్యంతాలు పెట్టి రెండేసి మూడేసి సర్గలు రాసేసిన రాజుల్ని యెత్తిపారెయ్య లేదు.

తెలుగుయొక్క ప్రత్యేకత్వం కోసం దేవులాడే యిప్పటి రకం వారే వారు కూడా ,,భావం ప్రధానంగా గలవి'' అని అనుకోనబడే తమ కావ్యాల్లో నాలుగు పాదాలకీ ఒక్కటే సంస్కృతసమాసం పెట్టి చివర తెలుగుప్రత్యయాలు తగిలించే వారు చాలామంది వున్నారు. ఇం తెందుకూ? తెలుగుని అభివృద్ధిపరచడానికి పుట్టిన విశ్వవిద్యాలయంకూడా తన పేరు ,,ఆంధ్రవిశ్వకళాపరిషత్'' అని చాటు

కుంటూ, అలాగే ముద్రలు వేసుకుంటూ తనకి గల పారతంత్ర్యాన్నీ, సంస్కృతానుసారిత్వాన్నీ మూడు మూర్తులా వ్యక్తం చేస్తోనే వుంది. „ఆంధ్ర విశ్వకళాపరిషత్తు" అని వుంటే „త్తు" అనే దేనా తెలుగని అనుకోడానికి వీలుంది కాని అట్లా గైనా లేదు గా మరిక్కడ!—

మన ప్రాచీన తెలుగు ప్రబంధాల్లో కథాభాగం చాలా తక్కువగా నున్నా వర్ణనాభాగమే చాలా యెక్కువగా నున్నా ఉన్నా దన్న సంగతి అందరికీ తెలుసును. యిప్పటి భావకవులు—కవికుమారులు మొదలైనవారి గ్రంథాల్లో కథాభాగం శూన్యమై అయోమయ మైన భావానికి ప్రధాన్యం ఉన్నా దని అనుకొంటున్నారు కాదూ కొందరు? అంచేత కథకి ప్రాధాన్యం అక్కరనే లేదు. ప్రాచీనుల తాలూకు ఆ గ్రంథాల్లోని వర్ణనలు ఏ మాదిరిగా నైనా రసానికి గాని భావానికి గాని కారణమౌతా యంటారా కా దంటారా? భావప్రధాన కావ్యంలో కథ సుతరామూ ఉండనే కూడ దని కామోసు కొందరి అభిప్రాయం. యిప్పటి వాళ్ళ నవీనఖండకావ్యాల్లో కూడా కవి ఎల్లాటివారినో నాయికానాయకుల్ని కల్పించి ఏ తుప్పల దగ్గిరో యేయేటి దగ్గిరో కలిపి—(వాళ్లని కాకపోయినా వాళ్ళ చూపుల నైనా కలిపి) కొంత దాకా ఆటాడిస్తారు. కాని ఊరికే ఆమాత్ర మేనా లేకుండా భావం అనేది గజ్జ కట్టుకొని గంతు లెయ్యదు గదా?

మన పూర్వీకులు రాసిన కవిత్వంలో అతిశయోక్తులు చాలా ఉన్నాయి. యిప్పటి వాళ్ల కవిత్వంలో స్వభావమే గాని అతిశయంగా చెప్పి పాఠకుడికి విసుగు కలిగించడం లేనే లేదంటూ అనుకోవడం వట్టి పొరపాటు. కొంతవరకూ అతిశయం లేందీ కవిత్వమే లేదు. కావ్యానికి సొగసుదనం యిచ్చేది అలంకారమనీ, అతిశయోక్తే మొదటి అలంకార మని అందరూ వప్పుకున్నారు. నవకవిత్వంలో కూడా "ఆవిడ ముఖం సౌందర్యం వొలుకుతున్నా" దన్నప్పుడు—స్వభావ మైనవర్ణనలో మాత్రం అతిశయం ఉం దంటారా! లేదంటారా?

ఇప్పట్లో చాలామట్టుకు నవీనఖండకావ్యాలు శృంగారరసం ప్రధానంగా గ్రహించినవే. నాయకుడు నాయిక సౌందర్యానికి ముగ్ధుడై రసపిపాసి అయిపోయి ఆభావోద్రేకంవల్ల తన్మయు డైపోయి కన్నీళ్లు బాగా కారుస్తాడు. ఇక కవి ఆ నాయకుడిలో లీన మైపోయి—అంటే కవి తన్నే నాయకుడిలా స్పష్టపరుచుకొని అపార మైన ఆనందాన్ని అనుభవిస్తాడు. అంచేత నాయకుడికి మల్లే కవి కూడా శృంగారరసపిచ్చి యెక్కువ అవుతుంది. తన మాటలు ఇతరులికి అర్థ మవనీండి...కాకపోనీండి. తనకి ఆనందం గలిగితే చాల్ను. తన భావతరంగాలు తన హృదయంలో తళుకుతళుకు మని అంటే చాల్ను. ఇల్లాంటి పాత్రలీనత్వం ప్రాచీన కావ్యాల్లో లేదంటూ ఆక్షేపణ. కేవలం కవి ఒక్కడి ఆనందానికే అయితే అతగాడు తను ఒక్కడూ గాలిమేడలు కట్టుకొని ఆనందించ కూడదూ! కలం కాగితం పుచ్చుకొని కాలం వృథా చెయ్యడం యెందుకంటానూ మరోసంగతి. శృంగారం యెక్కువగా ప్రాచీనప్రబంధాల్లో వర్ణింపబడ్డా దని అంటూంటారే—కేవలం యిప్పటి వారు అరసం మినహాయించి గ్రంథాలే రాయరే, అది మహా బాగుంది కామోసు. వెనకటికో పెద్దమనిషి పెంటకుప్పలో దొర్లాడుతూ వెంకన్నగాడి వెర్రి యెలా ఉందిరా అంటూ ఇంకో వాణ్ణి పరామర్శించినట్టు.

ఇల్లాంటి కవిత్వా లన్నీ వాఙ్మయానికి పురోభివృద్ధికి మూల మంటూ కొందరి యువకుల ఆశయం. ఇల్లాంటి వాట్లో నే జీవితాదాదర్శం ప్రతిబింబిస్తూ ఉంటుందిట. ఇప్పుడు కొందరు నెలల పిల్లలు కూడా కవయిత్రలూ, కవీశ్వరుళ్ళూ అయిపోయి పత్రికలకి ఎక్కుతున్నారు—జీవితాదర్శం అనుభవపూర్వకంగా ప్రతిబింబింపచెయ్యడానికి ఇలాంటివి అనుగుణాలా?—పోనీండి—అపనిబిడ్డలు—వాళ్లకి మాట

లు రాకపోతేనేం లెండి—లోకానికి హితోపదేశం చెయ్యడం మాత్రం మంచిది కాదూ ?

ఒక చిత్రం, ఈమధ్య ఒహాయన ఒకభావ కథ కాబోలు, రాస్తూ మంచి వస్తువులు పాడుచేసిన పసిపిల్లాడ్ని తల్లి మందలించే సందర్భంలో "నాన్నా ! మంచి వస్తు యిలా పాడుచేస్తే ప్రకృతి శ్మశానమయం అయిపోదూ" అంటూ తత్త్వోపదేశాన్ని దబాయించేడు. ఆతత్వాన్ని, అపసిబిడ్డ అవలీలగా గ్రహించి "అమ్మా ! చమించాలి. తెలియక చేసాను" అంటూ క్షమార్పణ చేశాడు. ఆపిల్లాడికి అట్టి తత్త్వం బోధపడ్డానికి ఆశ్చర్య పడాలో, ఆనందించాలో తెలీడం లేదు.

ఆడాళ్లకి మొగాళ్లతో గూడా సరిసమానమైన హక్కులు యిచ్చి వాఙ్మయతత్త్వాన్ని సాంఘిక తత్త్వంతో మేళగించి నవ్యతలో ఒక అడుగు ముందు వెయ్యాలని కొందరి సిద్ధాంతం. భావకథకులు కొందరు ఈసూత్రానికి ఉదాహరణ లిస్తూనే వస్తున్నారు. ఒహ పదిహేడు పద్దెనిమి దేళ్ల అమ్మాయి ఒక్కర్తే ఒహ ఊర్నించి మరోహ ఊరికి 'ప్రయాణమై తన్ను స్టేషనులో కలుసుకోవలసిం దని తన కిష్టుడైన—పరిచితుడైన స్నేహితుడికి ఉత్తరం రాస్తూ, అతడ్ని అట్లాగే కలుసుకుని, రాత్రి తొమ్మిదిగంటలప్పుడు అతగాడితో చెట్టాపట్టాలు వేసుకుని, బీచి యిసకతిప్పల్లో ఎదురుగుండా, అతనికి తగులూ కూర్చుని (అంటే తన ఉత్తమ ధర్మానికి యేమీ లోటు రాకుండా ప్రవర్తిస్తూ అన్నమాట) ముచ్చట లాడుతూ కూర్చుంది. ఆఖరికి అస్నేహితుడు కొంచెం ప్రణయం రకంవారీగా మాట్లాడగా, ఆవిడ అతగాడియందు పశుత్వాన్ని ఆరోపిస్తూ తన సతీత్వాన్ని ప్రకటిస్తుంది, వెనకటి కొహాయన అతిథికి విస్తట్లో వడ్డించి, అతడు పరిషేచనం చెయ్యబోతూ వున్నప్పుడు "ఎవడ్రా నిన్ను రమ్మన్నది తిండికి" అంటూ అన్నట్టు. యిల్లాంటి వాటినిపట్టి చూస్తే యీతావతా యేమిటి తెల్తుం దంటే—ఒకావిడ యితరుడితో గూడా గది ప్రవేశించి తలుపులు బిడాయించుకుని తెల్లార్లూ ఉండి ఉదయం తన పాతివ్రత్యమహిమని ప్రజల్లో ప్రకటించుకోవచ్చు నన్నమాట, ఇల్లాంటి స్వేచ్ఛ గదూ ఆడదాని క్కావా లంటూ అందరమూ ఘోషించేది ?

ఇప్పటి కవికుమారుల దృష్టి చాలావరకూ రాజుల్నీ, రాజ్యాల్నీ విడిచిపెట్టి సామాన్యులు, బీదలు, వారి జీవితాలు మొదలైన వాటి మీదికి మళ్లింది. అల్లాంటి బీదవార్ల జీవితతత్త్వాన్ని నిర్ణయిస్తూ యీమధ్య నొకాయన ఒక కథలో ఒక మహోదయామయురాలు ఒక బీదముష్టిపిల్లవాడికి కొంచెం చను విచ్చి, క్రమక్రమంగా వాడు చిన్నచిన్న మాటలచేత తన్ను స్వాధీనం చేసికోగా తన మొగుడి మాట లక్ష్యపెట్టక వాడి మూలాన్ని తనకీ, భర్తకీ కూడా హాని తెచ్చుకున్నట్టు వర్ణించాడు. అది స్వాభావికంగా ఉందని ఆయన అభిప్రాయం కాబోలు. కాని అందులో సంగతంతా స్వభావానికి విరుద్ధంగానే వుంది. రసం ప్రధానంగా ఉంటే పెద్దవాడి చరిత్రే బాగుంటుంది—తక్కువవాడిది బాగుండదు—లేక తక్కువవాడి చరిత్రే బాగుంటుంది. రాజులు మొదలైన వాళ్లని గొప్పగా వర్ణించడం విరుద్ధం అనడానికి ఏమీ వీలు లేదు.

అంచేతే, నవీనులు కొత్త ఛందస్సు లాశ్రయించి నంతమాత్రాన కవిత్వంలో నవ్యత కలగదు. రసం చిప్పిలుతూ వున్నప్పుడు ఏఛందస్సయినా బాధ లేదు. అది ప్రధానం కాకపోతే ఎన్ని ముత్యాల సరాలూ పగడాల సరాలూ కూర్చినా ప్రయోజనం లేదు.

గ్రాంథికభాషలోనే వాఙ్మయం అంతా ఉండి తీరాలని ముడికట్టుకొని కూచోవడం కూడా అంత సరసంగా లేదు. మొదట్నుంచీ తెలుగులో పద్యకవిత్వమే ప్రారంభమైంది—సంస్కృతంలోలాగ. పద్యకవిత్వానికి కావలసివచ్చింది కట్టుబాటు. మాట్లాడుకుంటున్న భాషలో పద్యాలు రాస్తే బా

గుండ వన్న సంగతి అందరూ అంగీకరిస్తారు. స్వేచ్ఛని చంపుకోవడంచేత—కట్టుబాట్లకి లొంగవలసిన అవసరం కలగడంచేత—అనవసరపదాలు పద్యకవిత్వంలో తమ ప్రాభవం చూపించాయి.

మన పూర్వీకులైన లాక్షణికులు పద్యభాగాన్ని వ్యాకరణసంస్కృతమైనభాషలోనీ, గద్యభాగాన్ని వాడుకభాషలోనీ వ్రాస్తూ వచ్చారు. గద్యం వ్యవహారభాషలో ఉండొచ్చు నని వాళ్లో మతం. అంచేతనూ, పాత్రోచిత మైన భాషనే వాడడం ఉచితం కాబట్టిన్నీ వ్యవహారభాషను నిరసించడం కూడని పని. అంధరికీ గ్రాంధికం వాడా లంటే ఒహ దాసీది (గొప్ప పండితుల యింట్లోది లెండి) బిచ్చగాడితో "ఇచ్చో భిచ్చం బిమ్మవా రెవ్వరున్ లేరు, పోరా!" అని వెనక ఒహ చోట పలికినట్లు పలకడం సభ్యం కాదనుకుంటాను.

ఇదివరలో కొందరు పండితులు పలికినట్లు మన వాఙ్మయాన్నుద్ధరించడానికి పద్యంకంటె గద్యమే ఎక్కువ అవసర మైనది. వెనకటి వాళ్లు రాసిన పద్యగ్రంధాలు చాలినన్ని ఉన్నాయి మనకి. భారతభాగవతాదులకంటె రసవంతంగా పద్యాలు రాస్తున్నా మని కొందరనుకోవడం ఉత్త మాట. అంచేత మన పూర్వీకులు యేవిషయంలో ప్రయత్నం చెయ్యడం మానివేశారో అందులో అంటే—గద్యలో బాగా పరిశ్రమ చేసి గ్రాంధికంలో గాని వ్యవహారభాషలో గాని, ఏవిషయానికి ఏది సరిపడి—సొగసుగా ఉంటుందో ఆలోచించి పుస్తకాలు గాని, వ్యాసాలు గాని రాస్తే బాగుంటుంది. సామాన్యంగా కధలూ, నాటకాలూ, కొన్ని రకాల విమర్శనలూ వ్యవహారభాషలో రాస్తేనే మే లని తోస్తుంది. ఈపై సంగతుల్ని కవులు, పండితులు బాగా ఆలోచించాలి; గాని ఏదో కవిత్వం చేస్తున్నాం, ఏవో పుస్తకాలు అచ్చుపడి అమ్ముడయి పోతున్నా యని ఆత్మతృప్తిని పొందడంవల్ల ప్రయోజనం లేదు.

సబ్బుబిళ్లలు

భారతుల పున్నయ్యశాస్త్రిగారు

"ఇదిగో"

"ఆఁ"

"చూచారా?"

"ఏమిటి?"

"చూపిస్తుంటే కనబడటం లేదూ?"

"కనబడుతూనే వున్నది"

"మరి యేమి టంటారేం చూస్తూనే?"

"నే చూస్తుంటే మటుకూ నీవు చెప్పకూడదా యేమిటి?"

"అయిపోవచ్చింది."

"సబ్బుబిళ్లేనా?"

"ఆఁ"

"సరే దాని కిప్పణ్నుంచి..."

"మరి మీతో ఏదైనా మూడు నెలలు ముందుగా చెబితేనేగా..."

"అందుకనా?"

"ఆఁ"

"సరేలే"

"ఎక్కడికి?"

"బజారుకు"

"ఎందుకు ?"

"సిగిరెట్లకోసం"

"సబ్బు కూడా పట్టుకరండి"

"ఉండంగానే హాతం చెయ్యకు."

"అవసరానికి తెచ్చే మామూలు లేదుగా మనకు?"

"తెస్తారులే"

"సబ్బు తీసుకరావద్దు"

"ఏం? ఏం వచ్చింది యింతట్లోకే? అంటిని గా?"

"ఏమని?"

"తెస్తానని"

"ఆహాఁ! ఏదో ఒకటి నేర్చి వుండ మన్నారు."

"................."

"తెస్తారులే. అని కసరుకోలే?"

"ఇంత కోప మైతే యెలాగా కాపురం?"

౩

"నిత్యం చెబుతూనే వున్నా"

"నే మటుకూ తెస్తా నంటం లేదూ?"

"సరే. యింకా ఏం? ఐనట్లే పని"

"ఇంకా యేమిటి? తెస్తా నంటూంటే చెపట మెందుకు?"

"రోజూ తెస్తూనే వుంటారా యేమిటి?"

"ఒకనాడు తెస్తే రెండోనాడు అడుగుతావా ఏం?"

,,తేకుండా మాటలు మాత్రం కోటలు ధూకించండి"

,,ఇదిగో, మీఅన్నయ్య గోడలు ధూకుతాట్టే. నిజ మేనా?"

,,సిగ్గు లేకపోతే సరి. మీతమ్ముడు ధూకాడు గా మొన్న చాలదూ?"

,,మీ అమ్మకు ఉత్తరం రాశావా?"

,,కార్డు తెచ్చి యిస్తేనా యివ్వండా?"

,,ఇవాళ్ల తేనా?"

,,తెచ్చేవా రడగడ మెందుకు?"

,,................."

,,ఏవో కబుర్లు చెప్పి సబ్బుమాత్రం తేవడం మానెయ్యండి"

౪

,,చూశారా? నాలుగు రోజులు కన్న రాదు"

,,నీవు రోజంటే అది వారం రోజులు వొస్తుంది"

,,అంటావు గాని ఇంత చిన్నసబ్బుతో ఆస లెవ్వరూ తోముకోరు"

,,నీవు కాబట్టి పొదుపు చేస్తున్నావు"

,,నిజంగాను"

,,సబ్బుబిళ్లలు మానెయ్య మంటున్నారు స్వదేశం వారు"

,,పోనీయండి. సిగిరెట్లు మాత్రం కాల్చనిస్తే బ్రతుకుతాం"

"అవ్వీ వద్దన్నారు"

,,పోనీ స్వదేశపు సబ్బులే తీసుకరండి"

,,అసలు మానెయ్య మంటూంటేనే ?"

,,అబ్బ! ఏమి దేశభక్తి కారిపోతూన్నది ?,,

,,కాక మరేమిటి నాశనమౌతుంటే దేశం సబ్బులతోటీ ఆడవాళ్లతోటీని"

,,అట్లాగేం ?"

,,మరి యేమి టనుకున్నావ్ ?"

,,నామాట మటుకు మరిచిపోవద్దు"

౫

,,జ్ఞాపకం వుందా ?"

,,మరచిపోతానా ?"

, ఏం తెస్తారు ?"

,,పెట్ రోసు తేనా ?"

,,వాడిందేగా ?"

,,పియర్సు తేనా ?"

,,విదేశాలు గా ?"

,,లక్సు"

,,విదేశం. పైగా సున్నపువాసన గూడానూ,,

,,మరేదో పురమాయించండి రాణిగారు,,

,,మైసూరుసబ్బులు బాగుంటాయిగా? పట్టుక రండి,,

,,తెచ్చిన తరువాత రాణీగారికి నచ్చకపోతే యేలాగ?,,

,,నాలు గైదు రకాలు పట్టుకరండి చూచి తీసు కుంటాను,,

,,ఐతే సబ్బుల లిస్టు తెచ్చి యిస్తాను చదువు కోని మంచిది పురమాయించు,,

,,చివరకి సబ్బూ వుండదు. లిస్టూ వుండదు. ఇదొక తంతు,,

,,ఎబ్బే? లిస్టు సాయంత్రానికి తెస్తే సరిగా?,,

,,చూడకబోతాం,,

,,తెచ్చారూ?,,

,,ఏమిటి? సబ్బుబిళ్లేనా?,,

,,అదుగో?,,

,,ఏమిటి?,,

,,లిస్టు తెస్తా మన్నారు గాదూ?,,

,,అరె...మరచిపోయా,,

,,చాల్లెద్దురూ. నే చెప్పలేదూ తంతని?,,

,,లే లే లే. నిజంగానే మరచిపోయాను,,

,,నాకు లిస్టూ వద్దు గిస్టూ వద్దు సబ్బు పట్టుక రండి,,

,,ఇవాళ్ల తెచ్చి యిస్తే సరిగా లిస్టు?,,

,,వద్దంటినిగా,,

,,అంత కోప మైతే యెలాగా?,,

,,కోప మేమిటి నాకు లిస్టు వద్దు,,

,,ఐతే సబ్బు బిళ్లే తేనా?,,

,,సాయంత్రానికి తప్పకుండా తీసుకరండి,,

,,సాయంత్రం గాదు రేపు,,

,,సరే. ఇహాను మీయిష్టం,,

,,అదేమిటి?,,

,,తేలేదుగా?,,

,,తెద్దా మనుకుంటూంటే..............,,

,,మరి యివాళ్ల లేదు,,

,,రేపు తప్పదు. ఒక్కనాటికి మ్ముంచుకోని పోలేదు లే,,

,,ఎన్నాళ్లనుంచి చెబుతున్నాను?,,

,,నిజమేలే. మరి జ్ఞాపకం............,,

,,ఏమంటే ఏం తీసుకోనిరానికాడికి?,,

,,మరిచిపోయా నని చెప్పాను గాదూ?,,

,,ఒకనాడా రెన్నాళ్లా?,,

,,ఏం చెప్పనూ?,,

,,నే నంటే అంతే లేద్దురూ?,,

,,నీ వేమిటి ఎవ రైనా అంతే జ్ఞాపకం లేక పోతే,,

,,మీ యిష్టం. తెస్తే తెండి లేకపోతే లేదు. ఇహాను మాత్రం చెప్పను,,

,,ఎందు కంత కోపం?,,

,,కోపమూ లేదూ గీపమూ లేదు,,

,,మరిచేపోయినందు క్కూడా మూతి బిగించు కుంటే యెలాగా?,,

౨

,,ఇదిగో కాసిని మంచినీ ళ్లిత్తురా?,,

,,....................,,

,,ఈగ్లాసు ఎక్కడిదే? మందేనా?,,

,,....................,,

,,గోదావరి ఫేనా యీ నీళ్లు? అప్పుడ్డే యెప్పుడు తెచ్చా?,,

,,....................,,

,,అబ్బాయి ఏడి?,,

,,....................,,

,,వంట ఐందా?,,

,,....................,,

,,ఈచీర మీ అమ్మ పండక్కు పెట్టిందికాదూ?"

,,తాకవాకండి,,

,,ఏం?,,

,,ఎందుకూ తాకడం?,,

,,...................,,

,,కోపం వచ్చిందా యేమిటి సబ్బు తేలేదని?,,

,,...................,,

,,పిచ్చిపిల్లా! ఇంత మాత్రానికే కన్నీళ్లా?,,

,,ఎన్నాళ్లనుంచి చెబుతున్నాను?,,

,,తేలే దనే నీ నమ్మకం! నీట్రంకులో చూచుకో ఎన్ని సబ్బు లున్నాయో?,,

,,...................,,

,,నవ్వు ఆపుకోకూడదు,,

,,చాల్లేదురూ?,,

,,...................,,

,,చిలిపిచేష్టలు పోతే పెద్దవా రైనాను,,

గంగాధరుఁడు

శ్రీ శేషాద్రి రమణ కవులు

కాకతీయ సామ్రాజ్యధూర్వహు లగు మంత్రి త్తముల జీవిత చరిత్రము చాలవఱకు మరుగుపడి యున్నది. ఈమధ్య మేము గడించిన నగునూరు సనమువలన గంగాధరుఁ డను మంత్రివర్యుని ర్చిన విశేషము లు గొన్ని తెలిసినవి. ఇవి చరిత్ర జ్ఞాసువుల కత్యంతోపయోగము లను తలంపుతో చురించుచున్నారము.

ప్రకృతశాసనము నిజాము రాజ్యము నందలి రీమునగరమునకు ఆరుమైళ్ల దూరమునఁగల నగు రులోని జీర్ణాలయము చెంతఁ బ్రాఁత పడి యుండఁగా నొక రాజకీయోద్యోగి కరీమునగరము నకుఁ దెప్పించి తన కార్యస్థానమునఁ బ్రాతించి డు. తెలుపువన్నె గల సాధారణ శిలపయి లుగువైపుల నిది వ్రాయఁబడినది. పడమటివైపు త్రిక లేచిపోవుటచే 36, 37, 38, 39, 40 పంక్తు లోఁ గొంతయంశము లోపించుటచే విషయసమ యమునకుఁ గొంత యిబ్బంది కలిగినది. శాసన ంతయు నింకొకమాఱు ప్రచురింపనెంచి ఖ్యాంశముల మాత్రము దృష్టాంత సమన్వితము ఁ బ్రచురించుచున్నారము.

శాసనపద్యకవిత ధారాళముగను మనోజ్ఞధారా శోభితముగను నిర్దుష్టముగనుండి తిక్కననాటి యాంధ్రకవితను జ్ఞాపకమునకుఁ దెచ్చుచున్నది. శాసనకవి పేరులేదు. రసవత్తరమగు ప్రథమ పద్యమిది.

శ్రీరామాధిపుఁ డింద్రనీల నిభ శా ♦ రీరుండు దారుండు గౌ
రీరామాధిపుఁ డుజ్జ్వల స్ఫటిక శా ♦ రీరుండు ధీరుండు భా
షారామాధిపుఁ డబ్జకేసర లస ♦ చ్ఛాయా శరీరుండు నుం
గారుణ్యంబున మాకు నివ్వుత సదా ♦ కౌలంబు గామ్యార్థముల్.

చరిత్రాంశములు

వేంగిదేశమున చెల్లకియను పురవరంబు గలదు. అచట ఆత్రేయగోత్రులు పలువురు గలరు. అందుఁ గొమ్మనార్యుఁడు జనించెను. ఆయనకు నారాయణుఁడను తనయుఁడు జనించెను. నారాయణుని భార్య ఐతమాంబ. ఈదంపతులకు గోవిందుఁడు జనించెను. ఈయనభార్య తురకమాంబ. ఈదంప

తులకు మన కథానాయకుఁడగు గంగాధరుఁడు జనించెను.

గంగాధరుఁడు విష్ణు భక్తుఁడు. సకల కళావిధిజ్ఞుఁడు. ఈయన కాకతి ప్రోలరాజు పిలుపుచే వేంగి దేశమునుండి ఓరుగంటి సామ్రాజ్యమునకు వచ్చి నగరకార్య నిర్వాహకుఁడుగఁ జిరకాలము పని చేసెను. ప్రోలభూపాలుని యనంతరము గంగాధరుఁడు కాకతీయ రుద్రదేవునికడ నమాత్యుఁడై నియోగవృత్తులు, అందలము, శ్వేతచ్ఛత్రము, వృత్తి స్వాస్థ్యములు బడసి దేవబ్రాహ్మణ ప్రీతికరములగు కార్యములు పెక్కు లొనరించినాఁడు. ఇంతియ గాక, రుద్రదేవుని యనుగ్రహమున డొండండు అను నగ్రహారములు విద్వాంసులగు బ్రాహ్మణులకు ధారాపూర్వకముగ నొసంగెను. మఱియుఁ దా నొసంగిన యగ్రహార గ్రామమున త్రికూటరూపమగు శివాలయము తటాకము పుష్పవాటికలు ప్రతిష్ఠించెను.

రుద్రదేవుని యనుగ్రహాతిశయమున గంగాధరుఁడు అనుమకొండలో రుద్రేశ్వరము చెంతఁ బ్రసన్న కేశవాలయమును బ్రతిష్ఠించెను. పున్నేశ్వరాలయముచెంత శివాలయ మొకటి నెలకొల్పెను. అందే త్రిమూర్తుల యాలయము, గంగాచెయ చెఱువుచెంత కేశవాలయము నెలకొల్పి సమీపమున బ్రాహ్మణుల సంధ్యాదిక్రియలకొక యాశ్రయము గట్టించెను.

సుప్రసిద్ధమగు హిడింబక్షేత్రమునం దిదివఱకే పెక్కు దేవళములు ప్రతిష్ఠింపఁబడియుండ నచట విష్ణుప్రతిష్ఠయు, బట్టశాల యను క్షేత్రమునందు "జినోహరి" యను వాక్యానుసారముగ హరి బుద్ధస్వరూపుఁ డను భావనతోడ బుద్ధప్రతిష్ఠ యొనరించెను. ఉత్తమతీర్థమగు సంవర్తకేశ్వరము నందు శివాలయము నిల్పెను. కాకతీయరుద్రదేవుని యనుగ్రహంబున రుద్రేశ్వరసమీపమునఁ ద్రిమూర్త్యాలయమును నెలకొల్పెను. మంత్రకూటమునం దొక విశాలతరమగు నీశ్వరాలయమును బ్రతిష్ఠించెను. నగునూరులో ఇరువదినాలుగు మూర్తులతోఁగూడి యున్న అచ్యుతుని బ్రతిష్ఠించి యట మహత్తరములగు ఆలయములను గట్టించెను. సప్తసంతానములతో బాటుగ గంగాధరుఁడు కృతిగూడ నొందెను.

ఈశాసనమును గంగాధరుఁడు శా॥ శ ౧౦౯౨ వికృతి సంవత్సర మాఘశుద్ధ పంచమి బుధవారము నాఁడు (క్రీ. శ. 1170) ప్రతిష్ఠించెను.

ఈ శాసనమునందు ప్రోలభూపాలుఁడు, ఘోరతరాజిలోలుఁడు, అతి అకుటిలచిత్తుఁడు అని ప్రశంసింపఁబడినాఁడు. ఈప్రశంస తగియేయున్నది. ప్రోలభూపాలుని జీవితమంతయు సామ్రాజ్యస్థాపనము నకుఁ దీవ్రకృషి చేయుటతోఁ గడిచినది. అవి యన్నియు గంగాధరుఁడు స్వయముగా నెఱింగినవేగాన శౌర్యవంతుడైన ప్రోలుని బీరమునకు మెచ్చి ఘోరతరాజిలోలుఁ డను విశేషణము జేర్చినాఁడు. ప్రోలరాజు కాలమున గంగాధరుని రాజకీయపరిజ్ఞానము ప్రఖ్యాతమయ్యెను. అతని మరణానంతరము రుద్రదేవుఁడు రాజ్యమునకు వచ్చుటయు గంగాధరుఁడు మంత్రియగుటయు నొకకాలము నందె జరిగియుండనోపు. ప్రోలభూవల్లభుని మరణమును గూర్చిన కథ యెంత సత్యమో నిరూపింప వీలులేకున్నను ప్రోలుని పరోక్షమున గంగాధరుఁడు మంత్రియగుటకుఁ గొంత కారణమేదేని యుండ వచ్చును. గంగాధరుని ఇతరశాసనములా యంశమును బయల్పఱచునేమో వెదకవలసి యున్నది. రుద్రదేవుఁడు కాకతీయులలో మిగులఁ బ్రతాపవంతుఁడు. ఆంధ్రవాఙ్మయాభిమాని. ఈయనను తృతీయావిభక్తి విశేషణములతో గంగాధరుఁ డీ క్రిందివిధముగాఁ బ్రశంసించినాఁడు.

శ్రీ కాంతాకాంతుచే నా
శ్రితవిబుధ జనాభీష్టిర ప్రాజ్యరాజ్య
శ్రీ కాంతాకాంతుచే వి
స్ఫురిత నిజభుజ నిస్త్రింశ నీతాన్యరాజ
శ్రీ కాంతాకాంతు నే దిక్
క్షితి గగన సమాశ్లిష్ట విస్పష్టకీర్తి

శ్రీ కాంతాకాంతుచే నూ
ర్జిత మృగరాజీ మృగారాతిచేతన్.

చం॥ పరనరపాలమౌళి మణి భాస్వరదీపితతా నితాంత వి
స్ఫురిత పదాబ్జుచే, నహిత భూతలనాథ వరూధినీ సరో
వర మథనప్రభూత మదవద్విరదాధిపుచే, విరోధి భూ
ధరశిఖరప్రభిన్న విదిత త్రిదశేంద్రనిశాత హేతిచేన్.

కం॥ సురకరిపతి మృగపతిహరి
సురసతి ధవల సరసిరుహ శుక్తి సదృక్
సురుచిరవిశద యశోభా
సురనిధిచే సుకవితరణి సురనిధిచేతన్.

కం॥ శరనిధి పరీతధాత్రీ
పరిపాలితదక్షిణప్రభాసి [త] భుజవి
స్ఫురుచేత నమ్రకుండా
పురనాథుం డైన రుద్రభూపతిచేతన్.

ఈ విశేషణములు రుద్రదేవుని పరాక్రమజీవితమునకును రాజధాని శాసనకాలమున అనుమకొండలో నుండెననుటకును ఆనాటి శాసనకవితారచనము గ్రంథకవితకుఁ దీసిపోవ దనుటకును చాలును. అనుమకొండలోని రుద్రదేవుని యాలయశాసనముకీ శాసనము ఎనిమిది సంవత్సరముల కావల నెలకొల్పఁబడినది కాననే గంగాధరుఁడు గావించిన రుద్రేశ్వరమునందలి ప్రతిష్ఠాదికములు సమన్వయింప వీలైనది

లఘువిమర్శనము

గంగాధరుఁడు నియోగిబ్రాహ్మణుఁడు. ఈయన ప్రోలరాజు కాలమున నగరాధికారిగను రుద్రదేవునికాలమున మంత్రిగనుండెననుటచే రుద్రదేవునికంటె వయస్సుదాటిన వాఁడని చెప్పవచ్చును. ఆకాలమున జైనమతము మంచి విజృంభణముగ నుండెను. వైదికమతమువారు జైనుఁడు బుద్ధుఁడు నొకఁడె యనియు జినోహరి' యను సూక్తి ననుసరించి జైనపూజ చేయవచ్చునని యుఁ దలంచినటులఁ గానఁబడుచున్నది. తరువాతికాలమున గణపతిదేవుఁడు శైవవిద్వాంసుల కాశ్రయమిచ్చిన కాలఁది జైనుల కవలంబనము తొలంగి వారి మతము దుస్థితికి వచ్చినదని తోఁచుచున్నది. రుద్రదేవుని కాలమున వైదికమతమువారు జైన బౌద్ధులయెడ సాదరభావముతో వర్తించిరనుటకుఁ గాకతీయ సామ్రాజ్యనిర్వాహకుఁ డగు గంగాధరుని శాసనములోని జినప్రతిష్ఠ చాలును.

గంగాధరుఁడు మతిప్రభాతియందు సురగురువనియు సకలకలావిధిజ్ఞుఁడనియుఁ బ్రశంసింపఁబడుటేకాక కృతిగూడ నందినటులఁ జెప్పఁబడినది. ఆంధ్రుల దురదృష్టవశమున ఆగ్రంథరాజమింతవఱకు వెలువడలేదు. ఎందైనఁగలదో కాలగర్భమునందు జీర్ణమయ్యెనో తెలియకున్నది.

అనుమకొండలోని గంగాధరుని ప్రతిష్ఠలన్నియు దాదాపుగ నశించినటులె తలంపవచ్చును. గంగాచెయుచెఱువు పుస్నేశ్వరాలయము ఎచటనున్నది తెలియదు. శాసనములోఁ బేర్కొనఁబడిన మంత్రకూటము గోదావరిఅరమున నిజాము రాజ్యములోఁగల మంథెనయె. సంవర్తకేశ్వరము బహుశః మానుకోటకుఁ జెంతగల సంకిసగానోఁపు. అంబుధి వేష్టితావనికి నాభరణం బగు హిడింబక్షేత్రమున గంగాధరుఁ డాలయప్రతిష్ఠ లొనరించెనఁట. అట శివాలయము లంతకును న్నె కలవఁట. ఈ హిడింబక్షేత్రము మెట్టుగుట్టయను పేరుతో ఖాజిపేట రైలుస్టేషనునకు మైలుదూరములోనున్నది. ప్రతాపరుద్రీయము ప్రతాపచరిత్రము స్థానికవృత్తాంతము లీయంశమును స్థిరపఱచుచున్నవి. ఇవిగలయాలయములలోను నగునూరులోగల యాలయములందును గంగాధర ప్రతిష్ఠితక్షేత్రముల గుర్తింపఁగల యవకాశములు నశించినందులకు వగవవలసి యున్నది.

గంగాధరుఁడు నగునూరిలో చతుర్వింశతిమూర్తి

యుక్తమగు విష్ణువిగ్రహమును బ్రతిష్ఠించినటుల నీక్రింది పద్యమునఁ గలదు.

"ఉ. శంశిత భక్తియుక్తి ననిశంబు నిజాంఘ్రులు గొల్చు నబ్జభూ
వంశము శోభిలన్ బ్రజల వాంఛిత పుణ్యఫలప్రదున్ సురా
ర్యంశజ దర్పహారు?—నచ్యుతునిన్ నగునూర నేఁ, జతు
ర్వింశతిమూర్తియుక్తముగ విశ్వమయాత్ముఁ బ్రతిష్ఠ సేసితిన్."

ఇరువదినాలుగు తీర్థంకరులతోఁ గూడిన జైన విగ్రహమె యిందు విష్ణువిగ్రహముగఁ బేర్కొనఁబడినది. లేకున్నఁ జతుర్వింశతి యవతార సహితమగు విష్ణుప్రతిష్ఠయే పురాణానుసారముగఁ జేయ వీలగును? నగునూరులోని యొక జీర్ణాలయమునందు చతుర్వింశతి తీర్థంకర సహితమగు జైనవిగ్రహము గోచరించినది. జినోహారి యనుటయు బుద్ధుఁడు జినుఁడు విష్ణునిమూర్త్యంతరము లనుటఁ బట్టి చూడ నగునూరిలోఁ గావించిన చతుర్వింశతి రూపవిష్ణుప్రతిష్ఠ జైనప్రతిష్ఠ యె.

ప్రకృత శాసనమునందు రుద్రదేవునకు "సుకవి తరణిసురనిధి" యను విశేషణముపయోగింపఁబడినది. ఇంతకుమున్నఁ గనుగొనఁబడిన యితని విద్యాభూషణ బిరుదమును సుకవితరణి సురనిధియను విశేషణము బలపఱచుటేకాక యీ నరపాలుఁడు కవితాభిమానియని తెలియఁజేయును. వేంగిరాజ్యము రాజనీతి విదులకు నెలవు. చాళుక్య సామ్రాజ్యమున నెందఱెందఱో రాజనీతి విదులు ప్రతిష్ఠగడించి సామ్రాజ్య నిర్వహణ చాకచక్యము గనుబఱచుటచే రాజకీయ కార్యనిర్వాహకుల నటనుండి పిలిపించుకొను నాచారము కాకతీయులలోఁ దఱుచుగా నున్నటులఁ గొన్ని శాసనములవలనఁ దెలియుచున్నది.

శాసన లిపివల్లనుండి కాకతి రుద్రదేవుని శాసన లిపికంటె విలక్షణముగనుండి యాంధ్ర లిపికిఁగల ప్రత్యేక వ్యక్తిత్వము సూచించుచున్నది. శాసనము మొదటివైపు ౨౫ పంక్తులు రెండవవైపు ౨౨ పంక్తులు మూఁడవవైపు ౨౩ పంక్తులు నాలుగవ వైపు ౪౦ పంక్తులుగ వ్రాయఁబడినది. పాదాంతమునందలి నకారపొల్లునకు నువర్ణము, అర్ధానుస్వారమునకుఁ బూర్ణానుస్వారము, యకారమునకు వలపలగిలక యిచ్చు చోద్విత్వము బుత్వముగల తావుల గుడికిక్రావడి, లోనగు సామాన్య వాఙ్మయ విశేషములే యీ శాసనమునందును బాటింపఁ బడినవి. మొత్తముమీఁద శాసన పద్యసంఖ్య 31. పద్యాదిని కందమును కందయనియుఁ జంపక మాలికాదుల వృత్తయనియుఁ బేర్కొనెను. వచనమునకుఁ బేరులేదు. పురుషోత్తమ యనుటకు బురుషోత్తమయని, లోలేక్షణియని యు రూపములిందుఁ జెప్పఁబడినవి. మొత్తముమీఁద శాసనము నిర్దుష్టమగు గ్రాంధిక భాషలో సమర్థుఁడగు ప్రబంధ కవిచే వ్రాయింపఁబడెనని తోఁచును.

శాసనము నందలి పద్యములను బ్రకృత కాలమున వ్రాయఁబడు విధముగ సంస్కరించి యిందు లిఖించితిమి. శాసనకాలమగు పండ్రెండవ శతాబ్దమున మహావైభవోపేతముగను, మనోహర శిల్ప సంవృతములుగను నలరారిన నగునూరు, అనుమకొండ, సంకిస, మంతెన, హిడింబాశ్రమము (మెట్టుగుట్ట) దేవళములు నేఁడు శిథిల శిలావృతములై పరిశోధదృష్టికి మాత్రము పూర్వస్వరూపము గోచరింపఁ జేయుచున్నవి.

ఆంధ్రుల చరిత్రమునఁ గాకతీయుల చరిత్రములోఁ బ్రోలరాజు రుద్రదేవుల కాలమునందును బండ్రెండవ శతాబ్దము నాఁటి యాంధ్రభాషా పోషకుల పట్టికయందును గంగాధరుని చరిత్రము లభించినంతవఱకేని జేర్చినచో భవిష్యత్పరిశోధనమున నింకఁ గొన్ని విశేషములు లభింపవచ్చును.

సౌందర్యోపాసిని

సహదేవ సూర్యప్రకాశరావు గారు

నాకు పిచ్చివాళ్లంటే చాలా సరదా. వాళ్లు ఎప్పుడూ వింత స్వప్నలోకంలో, స్వయంగా సృష్టించుకొన్న ఊహాప్రపంచకంలో నివసిస్తారు. వాళ్లు అలా ఉండకపోతే వాళ్ల జీవితం మహాదుర్భరంగా ఉంటుంది.

వాళ్ల పిచ్చే వాళ్లకి ప్రాణరక్ష......కాని అకస్మాత్తుగా ఎప్పుడో ఒకప్పుడు వాళ్లు సుస్థితిలోనికి రావచ్చును. వాళ్లు తమ ఉన్మత్తావస్థకు కారణం తెలిసికొని పునః ఉన్మత్తులైపోవచ్చు. లేదా మరణించిపోవచ్చు

మానవసహజస్వభావాలకి, సంఘాన్ని చక్కట్లు దిద్దే శాసనాలకి వారు విదూరులు. వారికి దుర్ఘటమయ్యే కార్యమేదీ లేదు. వారు తలచుకున్నంత మాత్రాన మహీశులైపోతారు. మహానుభావులైపోతారు. మహాదేవులైపోతారు. వారు నిత్యయౌవనుల క్రిందే; నిత్యబలీయుల క్రిందే;! నిత్యసుందరుల క్రిందే ఉండగలరు. వారు సతతం అనిత్య వాతావరణంలో మెలగుతూ ఉండడంచేత వారెప్పుడూ ఆనందరసాధిష్ఠానదేవతలే! ఒకదానికొకటి సంబంధబాంధవ్యము లేని, ఎక్కడ పుట్టి ఎక్కడ గిట్టుతవో తెలియరాని భావనాపథాలకు నిలయమైన వారి మనస్సులను పరిశీలించడమంటే నాకు అపరిమితానందం. ఆచూడడం ఎలాగ ఉంటుందంటే? భీషణగర్జనలతో పొంగులు వారుతూ ప్రవహించే ఒక నదీమతల్లి జన్మస్థానాన్ని అవలోకించినట్లే ఉంటుంది.

౨

ఒకరోజున పిచ్చి అస్పత్రిని చూడడానికి వెళ్లాను. నాకు అక్కడ విశేషాలు చూపిస్తున్న వైద్యుడు "మీ కిప్పుడొక యపూర్వ విషయం చూపించబోతున్నాను" అన్నాడు.

డాక్టరు ఒక గది తలుపు తెరచినాడు. తెరచి ఆగది అంతర్భాగాన్ని చూపించినాడు. అక్కడ నలభై ఏళ్లు దాటిన సౌందర్యారాసిని చూచినాను. ఆమె ఒక కుర్చీలో కూర్చుని చేతిలో నున్న అద్దములో తన విలాససంపత్తిని చూచుకుంటున్నది. ఆవిడ మమ్మల్ని చూచిన తక్షణమే చటాలున లేచి గది చివరభాగానికి పోయి అవగుంఠనంతో మెల్ల మెల్ల ఆచ్ఛాదనం చేసికొని మాచెంతకు వచ్చినది.

"ఇప్పుడు ఎలా గున్నది మీకు" అన్నాడు డాక్టరు.

ఆమె ఒక దీర్ఘనిశ్వాసము విడిచిపుచ్చి "ఏమని చెప్పను? నా అవస్థ చాలా విషమంగా ఉంది. దినదినానికి అవి పెచ్చుపెరుగు తున్నవి" అన్నది.

ఆమె తలుసున్నట్లు ఆమె అవస్థ విషమంగా లేదని ఆమెచేతనే ఒప్పించుదామని డాక్టరు మృదులస్వరంతో "మీరు దురభిప్రాయపడుతున్నారు" అన్నాడు.

ఆమె ఇంకా దరిదాపునకు వచ్చి "నిజమే, నిజమే. ఈయుదయాన్ని పది ఎక్కువ కనిపించాయి. ఎడమ చెక్కిలిమీద మూడు, కుడిచెక్కిలిమీద నాలుగు, ఫాలభాగాన్ని ఒకటి...దుర్భరము. ఈస్థితిలో ఉండగా నన్ను ఎవ్వరినీ చూడడానికి అంగీకరించను. అంగీకరించను — కన్నకుమారుణ్ణి సహితమూ" అని కుర్చీలో కుంచుకొనిపోయి వెక్కివెక్కి రోదింపసాగింది. డాక్టరు కూడా ఆమె ప్రక్క నున్న కుర్చీలో కూర్చుని ఆదరణపూర్వకంగా "అయితే సరే...చూడనీయండి...కొంచెం మందు రాస్తే తగ్గిపోతవి క్షణములో" అన్నాడు.

చూపించనని ఆమె ఔదల పంకించింది. ముసుగుతీయడానికి ప్రయత్నించినాడు కాని డాక్టరు, ఆమె భల్లూకపు పట్టు పట్టడంచేత వీలులేకపోయింది. ఆమెను శాంతిపరచుదామని ప్రయత్నించి డాక్టరు "ఎందుకు అలా బాధపడతారు. మీకు వచ్చిన

మచ్చల నన్నిటిని నే నెలా మాసిపోచేస్తున్నానో మీకు తెలియునుగా—ఎవ్వరు మీకు మచ్చలు వచ్చినట్లే తెలిసికోలేరు. మీరు చూపించకపోతే నేను బాగుచేయడ మెలాగు? నేను బాగుచేయలేను...'' అన్నాడు డాక్టరు.

ఆమె లోలోన గొణిగికొన్నది.

"మీకు చూపించడానికి నా కీషణ్మాత్రమయినా అభ్యంతరము లేదు...కాని మీతోవచ్చిన వారిని నే నెరగను...'' అని నెమ్మదిగా అన్నది.

"అదా మీ సందేహము. అందుకు మీ రింత మాత్రం సందేహించవద్దు...ఆయన కూడా డాక్టరు గారే. ఈవిషయాల్లో సిద్ధహస్తుడు'' అని డాక్టరు చెప్పి నమ్మించిన మీదట ఆమె ముసుగు సడలించినది. ఆమె ఉద్రేకపూరితయై భీతావహ అవడానికి నాకు కారణాలు గోచరించలేదు. మా పరిశీలనను తప్పించుకుంటు ఆమె మొగము వాంచికొన్నది. ఆమె వదనంమీద ఒక గురు గాని, ఒక చుక్క గాని అథవా ఒక చిన్న గీత గాని లేదు. ఆమె ఊర్ధ్వముఖియై నాతో "మా అబ్బాయికి వచ్చిన జబ్బులో నేను పరిచర్యలు చేయడంచేత నా కీ భయంకర మయిన వ్యాధి తటస్థించి...విశేష సపర్యలు చేసి వానిని బ్రదికించుకొన్నాను...కాని నా కీ రోగం వచ్చి పడింది. సాధారణంగా లోకంలో వనితలు దేనిని మహాభాగ్యంగా చూచుకుంటారో దాన్ని నా కన్నకుమారుని కోసం—అతని ప్రాణరక్షణ కోసం త్యజించాను...నా ధర్మాన్ని నేను ఆచరించడంచేత నాహృదయం ప్రశాంతంగా ఉంది. అయినా ఈనారకయాతనము అనుభవించక తప్పదు'' అన్నది.

ఇంతలో డాక్టరు మందులో ముంచిన బ్రషును తీసి "ఇది సరి చేయనీయండి'' అన్నాడు.

ఆమె తన కపోలాన్ని పైకి ఎత్తింది. డాక్టరు ఆ బ్రషును పుచ్చుకొని లేని మచ్చలమీద అద్దినాడు. ఫాలభాగాన్ని కపోలభాగాన్ని కూడా ఆమందుతో అద్దుతూ "ఇప్పుడు చూడండి—ఒక్క మచ్చయినా లేదు. ఒక్కటీ'' అన్నాడు డాక్టరు.

ఆమె అద్దంలో మొగం చాలా సేపు చూచుకొని అనంతబాధ నిర్వృత్తి అయినట్లుగా దీర్ఘ నిశ్వాసం విడిచిపుచ్చింది.

"నిజమే. ఒక్క మచ్చా లేదు. లేదు నిజమే. మీకు చాలా కృతజ్ఞురాలను'' అన్నది.

డాక్టరు లేచాడు. మే మామెవద్ద సెలవు పుచ్చుకొని బయటకు వచ్చాము.

3

ఆమె గదితలుపు మూసి డాక్టరు "ఆ దురదృష్టవతి ఆత్మకథ చెప్పుతాను విను'' అన్నాడు.

ఆమె ఒకప్పుడు సుందరరూపి. ఆమెకు జీవితం సుఖస్వప్నంగా ఉండేది. ఎన్ని నాళ్లు గడచినా జీవితం మీద ఏహ్యభావం గాని విరక్తి గాని కలగలేదు. ఆమె సౌందర్యపిపాసువు. సౌందర్యం కోసమే ఆవిడ జీవిస్తున్నది. సౌందర్యార్చనయే ఆవిడకు జీవితపరమావధి. ఎప్పుడు ఏనిముసం ఆమె శరీరం సడలిపోతుందో ఏమో అనే భావన హృదయాన్ని కలగించడంచేత నిరంతరం శరీరపోషణలో నిమగ్న అయ్యేది.

ఇలా ఉండగా ఆమె భర్త పరమపదించాడు. ఆమె వైధవ్యజీవితం నెరపవలసివచ్చింది. ఆమెకు ఒక్క గాని ఒక్క కొడుకు కావడంచేత ఎంతో మురిపెంగా ఎంతో అపరూపంగా పెంచుకునేది. ఎంతో శ్రద్ధగా చదువు చెప్పించుకొనేది.

ఆ అబ్బాయి పెరిగి పెద్దవడం ఆమెకు అశనిపాత మయినట్లయింది. తన కుమారునికి యౌవనాంకుర మవడం తన వార్ధకదశకు నాంది అయిందని గ్రహించుకొన్నది. కాలానికి రెక్కలుంటవి. దాని పురోగమనాన్ని ఎవరూ నిగ్రహించలేరు. ఆనాటినుండి ఆమె భీతావహ యైపోయింది. నిరంతరం పరితాపంతో కొట్టుకొనిపోయేది. ఆనాటినుండి ఒక చేతి అద్దాన్ని సర్వదా దగ్గర ఉంచుకునేది. ఆమె లలాటభాగాన్ని వనితాసౌందర్య

వినాశకము లైన ముడుతలు పడుతున్న వేమో అని పదేపదే పరిశీలిస్తూ ఉండేది. సౌందర్యపోషణకరా లగు వస్తువులను ఎన్నిటినో ఆమె భద్రపఱచేది. నానాదేశాలనుండి వచ్చే విలాసద్రవ్యాలతో ఆమె గది శోభస్కరంగా ఉండేది. మానవులు జీవితాన్ని ఎలా వంచింపచూస్తారో అలా ఆమె ప్రకృతిని వంచింప చూసేది.

ఆమెకు ముప్పది అయిదేండ్లు ఉంటవి. అప్పుడు ఆమె కొడుకు జబ్బుపడ్డాడు. మొట్టమొదట అతని రోగకారణం గుర్తించడం కష్టమయింది. రోగిని ఆస్పత్రికి తీసికొని వెళ్లారు. ఆమె ప్రతి ఉదయం ప్రతి సాయంకాలం చక్కగా దిద్దితీర్చికొని జబ్బుగా ఉన్న కొడుకుని చూడడానికి ఆస్పత్రికి వేళ్లేది. వెళ్లి ద్వారము దగ్గరే నిలిచి నవ్వుతూ "అబ్బాయి! ఎలా గున్నది. కులాసాగా ఉన్నావా" అనేది.

జ్వరంతో బాధ పడుతున్నా ఆపిల్లవాడు "కొంచెం నిమ్మళంగానే ఉంది అమ్మా" అనేవాడు. మళ్లీ ఇంకోసారి వచ్చి "అబ్బాయి! డాక్టరు ఏమన్నాడు" అని తొందర తొందరగా అడిగేది.

ఒకనాడు ఆమె ఘూమూలుగా సింగారించుకొని ఆస్పత్రికి వెళ్లింది. అక్కడి వారు "అమ్మా! నీకొడుక్కి స్ఫోటకం వచ్చింది" అన్నారు. ఆ మాట విని కెవ్వున కేక వేసింది. చరాచరా ఆగది విడిచి వెళ్లిపోయింది.

ఆమరునాడు దాసి నిద్రలేపడానికి వచ్చింది. ఆగది నిండా మందు చల్లబడి ఉంది. రాత్రి తెల్లవార్లూ కంటికి కూర్కు లేకపోవడంచేత ఆమె పాలిపోయి ఉంది. వడవడ వడకిపోతూ ఉంది.

దానిని చూచి "అబ్బాయికి ఎలా ఉంది" అని ప్రశ్నించింది. "బాబుగారికి సుతలాం బాగా లేదు" అని జబా బిచ్చింది దాసి. మధ్యాహ్నం లేచి సరిగ్గా భోజనం చేయకుండగానే వైద్యుని వద్దకు వెళ్లి స్ఫోటకం రాకుండా కాపాడుకోవడానికి మందులు అడిగి తెచ్చుకున్నది.

ఆమర్నాడు కూడా ఆమె కుమారునికి నిమ్మళించలేదు. ఆమె గదివిడిచి ఒక్క నిమిషం బయటకు రాలేదు. రోజురోజెల్ల ఆమె మూలుగులతో గడిపిం దని దాసి చెప్పింది పది రోజులు గడిచాయి. కాని ఆమె బయటకు రాలేదు.

పదకొండో రోజున కొడుకు ట్యూటరు ఆమెను చూడడానికి వచ్చి లోపలికి కబురు పంపాడు. ఆమె లోపలికి దయచేయ మన్నది. కుర్చీ చూపించి కూర్చోమన్నది. అతడు కూర్చోడానికి నిరాకరించి "అమ్మా! మీ అబ్బాయి చాలా రుజావస్థలో ఉన్నాడు. మిమ్మలిని చూడా లని తపిస్తున్నాడు" అని చెప్పినాడు.

"అయ్యో దేవుడా!" అని వెక్కివెక్కి ఏడుస్తూ మంచంమీద కుంచుకునిపోయింది.

"డాక్టరు ఏమీ ఆశ ఉన్నట్టు చెప్పడం లేదు. మీ అబ్బాయి మీకోసం అంగలారుస్తూ మీ రెప్పుడు వస్తారా అని నిరీక్షిస్తున్నాడు" అని చెప్పి ప్రత్యుత్తరాన్ని ఆశించక ఆయన వెళ్లిపోయినాడు.

రెండు గంట లయిన తర్వాత రోగి తన అంత్యదశ దగ్గరిల్లిన దని ఎరిగి తల్లికోసం పలవించాడు. ట్యూటరు మళ్లీ తల్లి దగ్గరకు వచ్చాడు. అత డా గది విడిచి వెళ్లే టప్పటికి ఆమె ఏ అవస్థలో ఉన్నదో ఇప్పటికీ ఆమె ఆ అవస్థలోనే ఉన్నది. వెక్కివెక్కి ఏడ్వడం కూడా మాన లేదు.

"అబ్బా! నేను...నాకు చాల భయముగా ఉంది. నేను రాలేను.........అన్నది. ట్యూటరు ఆమెను శాంతింపచేయడానికి చాలా ప్రయత్నించాడు. ఆమెను రోగి దగ్గరకు బలవంతముగా నైన తీసికొనివెళ్లడానికి ప్రయత్నించాడు. కాని ఏమీ లాభం లేకపోయింది. ఆమె రోదనధ్వనులు మాత్రము విశేషించిపోయినవి. కాని ఏమీ ప్రయోజనము లేకపోయింది.

డాక్టరు కూడా వచ్చాడు. ఆమెను బలవంతముగా కుమారుని దగ్గరకు తీసికొని వెళ్లా లని భావించాడు. ఆమె ద్వారమువద్దకు వచ్చి ద్వార

మును పట్టుకొని ప్రేలాడింది. తరువాత ఆమె డాక్టరు పాదాల మీద పడి తనని క్షమించాలని తాను చాలా పిరికిదాననని, తన కుమారుణ్ణి తాను అత్యంతంగా ప్రేమిస్తున్నానని, అతడు తప్పక జీవించుననని అతడే తన జీవనైక సారమని...... ఎంతో జాలిగా ప్రాధేయపడింది.

౪

ఆమె కొడుక్కి అంత్యకాలము ఆసన్నమయింది. మరణబాధ పడుతున్నాడు. చావు తెలివి రావడం వల్ల తన తల్లి మనస్సును గ్రహించుకున్నాడు. అన్ని సంగతులు బోధపరచుకున్నాడు.

“మా అమ్మ నన్ను చూడడానికి ఇష్టం లేకపోతే దూరంగా కిటికీకి అవతలగా నైన నిలబడి మనండి. నే నామెవద్ద నుంచి కళ్లతో సెలవు పుచ్చుకుంటాను” అని గొణుగుకున్నాడు. డాక్టరు మళ్లీ ఆమె దగ్గరకు వచ్చి “నీ కిప్పుడేమీ అపాయం కలగదు. ఎందు కంటే నీ వాతనికి చాలా దూరంలో ఉంటావు. కిటికీకి అవతలగా నిలబడు” అన్నాడు.

ఆమె అందుకు అంగీకరించింది. చేతితో స్ప్రింగుసాల్టు సీసా పట్టుకుని బయలుదేరింది. ము మంతా కప్పేసుకుంది.

“నాకు ధైర్యం చాలదు. నాకు చాలా సిగ్గుగ ఉంది. భయంగా ఉంది” అని ఆమె గొణుగ కొంటూనే ఉంది. ఆమెను బలవంతంగా నిర్ణీత స్థలానికి తీసికొని వెళ్లారు. ఆమె అక్కడనుంచి ఒక్క అడుగు అయినా ముందు వేయలేదు. దా బోయే వాళ్లు వినేటట్టుగా మూల్గ సాగింది. ఆమె కొడుకు కిటికీకేసి తల తిప్పాడు. మూసికొ పోతున్న కన్నుల నెత్తి పవిత్రమయిన తల్లిని—అందరానీ అయిన తల్లిని—అంత్యకాలంలో తుదిసారి చూచాడు.

అతడు అలా చాలా కాలం చూచాడు. అర్ధరాత్రి వరకు అగోడవైపు తల త్రిప్పుకొని కన్నులు మూసికొన్నాడు. అత డొక్క పలుకయినా పలకలేదు.

మరునాటి యుదయాన్ని ఆ అమాయికుడు మరణించాడు.

ఆమె ఉన్మత్త యైపోయినది.

(ఇది ఒక ఫ్రెంచికథకు తర్జుమా)

ఉత్తరరామచరితము

డాక్టర్. చిలుకూరి నారాయణరావుగారు ఎం, ఏ., పిఎచ్, డి, ఎల్. టి.

(మొదటి సంచిక తరవాయి)

అరవ తెనుగు

“నీరసమైన కావ్యమును నిండ రసావహమౌను (విమర్శకుల స్నేహము కల్మిని)-అవతారిక.

“ఈ దినము నిండ శుభావహమయ్యె”—పు. 28.

అరవవారు ‘రొంబా చందోచం’ అన్నట్టు.

కేవలశాస్త్రంపుఁ గంపు.

(1) “వచ్చితి నిపుడు వాల్మీకి వలన నుండి”—పు. 29.

‘హిమగిరి వలన నుండి గంగ వొడమె”—చిన్నసూరి.

(2) “ఓ జననిరో!...ఓ తల్లిరో!”

(3) “దుగినుఁడు”—పు. 131 ఇది ద్రుహిణశబ్ద భవముగా అచ్చ తెలుగు కావ్యాలలో వాడేమాట.

అచ్చ తెనుగు కావ్యాలవాసన.

(1) దూషణాఖ్యుండు నలఖరుండు మూఁడు తలలవాఁడు”—పు. 38.

త్రిశిరుఁడు అనే సంజ్ఞావాచక శబ్దానికి తెనుగు,

(2) “నా కూఁతును బరిశోధించుట కగ్ని యెవఁడు?”—పు. 89.

“అతనికిఁ బ్రీతి యెక్కువ యీ రాజు కూఁతునందు”—పు. 92.

చిన్నయసూరి లక్షణానికి సరిపోయినా, అరవము చదువుకొన్న వారికి ‘కూతు’ అంటే అశ్లీలార్థమే స్ఫురిస్తుంది. అరవములో ‘కూత్తు’ అంటే ‘యోని’ అని అర్థము. వ్యవహారములో కూతును, కూతునందు అనే రూపాలులేవు. కూతురిని, కూతురియందు అని ప్రయోగాలు కుప్పలు తిప్పలుగా ఉండగా చిన్నయ్య పరమప్రమాణము కావడమువల్ల ఈ అనర్థము వచ్చినది.

సంధులు.

ఎచట నుండిట వచ్చెనో (52); ఏలినాతనిన్ (అవతారిక.)—ఈ సంధులు పంతులుగారి కిష్టమయితే మాకు సంతోషమే. కాని, ‘గులగులనుచు’ (45) అని సంధిచేస్తే చెవికసహ్యముగా ఉంటుంది.

వచనదోషము.

“ఎవరురా సేవకుఁడు (27); మాన్పవారు సరసులెకాదే (అవతారిక); వదినెగారడుగుచున్నది. (11); పూని మా యన్నగారు (12). జనకసుత నాకుఁ గూఁతురే యనెడువారు మహారాజెప్పుడును (91); దేవర యిట్టి నిశ్చయ మెట్లు చేసితిరో గదా (23)

లింగదోషము.

“సల్లకి వృక్షపంక్తులన్ (సల్లకీ), 41;

పురుష వ్యత్యయము.

(1) “దేవర యిట్టి నిశ్చయ మెట్లు చేసితిరో గదా”—(23)

ప్రథమపురుష కర్తకు మధ్యమ పురుషక్రియ, ‘వాడు వచ్చినావు’ వలె.

(2) (మీరు) “ఏమని పిలిచిరి యింతకు ముందు?”—(109) మధ్యమ పురుషకర్తకు ప్రథమ పురుషక్రియ, ‘నీవు వచ్చినాడు’ వలె.

గ్రాంధిక సంఖ్యాపరిజ్ఞానము.

‘పదియు నాలుగు వేలును బదుగురు మతి నలుగురును’—(38)—‘పదియు నాలుగు వేవుర్రు’ అని ఉండవలెనేమో!

అరసున్నలు.

(1) సిద్ధములైన అరసున్నలు తెలియక పోవడము : ‘ఏంగుచనా’ అని లక్షణ ముదాహరించి, సార్థానుస్వారముగా ‘ఏఁగు’కు ప్రయోగాలిచ్చి చూపినా, మేము చూపించినాము గదా అని పంతులుగారు అరసున్న ఉంచడము మాని ఉంటారు. చూ. అవతారిక v, 3, 92 102; ‘ఏఁటికి’లో అరసున్న ఉండవలసినా విడిచిపెట్టినారు (110).

(1) ‘పరఁగు’లో అరసున్న లేదయ్యా అని మొరపెట్టుతూ ఉన్నా పంతులుగారికి తమ పట్టువదలేతమది. చూ. 40, 42, 88.

(2) సాధ్యములైన అరసున్నల తబ్బిబ్బులు : ద్రుతము మీద అరసున్న వస్తుందా, ద్రుతము లోపించినప్పుడు వస్తుందా అని పంతులుగారు చాలా తికమకలు పడ్డారు. మొదట వ్రాసినప్పుడున్ను, పుస్తకమంతా అచ్చయినంతవరకున్ను కూడా ద్రుతము మీద అరసున్న తగిలించినారు. దిద్దుకొన్న అరసున్నలు ఏ మును గురువులము 6. 3 సిరవర్ణములకు ముందు అరసున్న ఉండదని మొదట మరచిపోయినారు. ‘రామభద్రుకినిఁ గూడ”—6;—అదిగోఁ జూడు (12);—భయఁపడి (33)—మువర్ణము లోపించింది కాబట్టి ఇచ్చట అరసున్న ఉండవలెనని భ్రమపడ్డారు;—దిద్దుకొన్నారు కారా అంటారేమో! పరిచితము కాని దానినొకరి నడిగో, పరిశోధన చేసో దిద్దుకోవాలి. డబ్భైయేళ్లు వచ్చినా, ఇంత కృషి చేసిన వారయినా ఈ స్వల్పవిషయాలలో కూడా పంతులుగారికి సందేహాలు విడలేదే. బడిపిల్లలు, జ్ఞానతృష్ణ గలిగిన పామరులు, వీరిమాట యేమిటి? కడవరకున్ను అరసున్నలు నేర్చుకొంటూ ఉండడమేనా? దేశములో విద్యావ్యాప్తి ఇం

దుమూలముగా అవుతుందా? ఇన్నిచోట్ల పంతులు గారు కష్టపడి దిద్దుకొని 29 వ పుటలో 'నిన్ను నే నెవరినిఁగా నెఱుంగవలయును' అనిన్ని, 22 వ పుటలో 'లోకప్రీతినిఁ గాదే' అనిన్ని ద్రుతము మీఁది అరసున్నను తీసివేయకుండా ఉంచినారే! 43 వ పుటలో 'అలుంగు'=(ఖడ్గము)లో అరసున్న ఉంచినారు, దీనికి ప్రయోగము? శబ్దరత్నాకరములో ఉన్నది గనుకనా? అచ్చట ప్రయోగమివ్వలేదు. పంతులు గారైనా యిస్తే నేర్చుకొంటాము. 112 వ పుటలో "మెఱుపుఁ దమము న్గ్రంబుగాఁ బెరసినట్లు" అని వ్రాసినారు. 'బెరయు' ధాతువు పరుషాది యని పంతులుగారి భ్రమ.

ఈ రీతిగా మాకు గ్రాంథిక భాషలో అనేక సందేహాలున్నవి. అడుగడుగుకు మా పని తడవు కొనడమే. చూడండి, ఒక్క ఉదాహరణము: 'మెఱుపు' అనవలెనా? 'మెఱపు' అనవలెనా? ఎంతో చిన్నవిషయము. కలిపికొట్టా కస్తూరిరంగా అనే వారిలో చేరితే సందేహానికే అవకాశములేదు. కాని, మామనస్సొప్పుకోదు. పంతులుగారు 'మెఱుపు' అని ప్రయోగించినారు. శబ్దరత్నాకరములో 'మెఱపు' ఉన్నదిగాని మెఱుపు లేదు. శ. ర. లో ఇచ్చిన ప్రయోగమువల్ల సందేహము తీరదు. ఏమిచేయుడము."

మాముద్దుల వ్యవహారము.

పంతులుగారు పరిషద్వ్యస్త్రోచ్ఛాదితులయినా వారున్ను మావంటివారే. వారు మాత్రము రసికులు కారా? లౌక్యములో ఆరితేరినవారు లోక వ్యవహారము నెట్లు తప్పించుకోగలరు? వారు మావలెనే నవ్వుతారు, మావలెనే ప్రశ్నిస్తారు, మావలెనే సందేహిస్తారు, దేశకాల పాత్రముల ననుసరించి సంభాషిస్తారు, మావలెనే కోపము, సంతోషము, హర్షము, అంతా మావలెనే. మడికట్టుకొన్నప్పుడు మాత్రము యథాశక్తి జపము, అంతే. ఆభేషజము మాత్ర మెందుకుఅని మాప్రశ్న. ఎవరేమనుకొన్నా పంతులుగారు మా వ్యావహారిక భాషా పోషకులే.

కాకపోతే చూడండి వ్యావహారికభాషకు ఆధముగా ఎన్ని ప్రయోగాలు చేసినారో!

1. "నాయికా నాయకులలో ఒకరు మరణింపఁగా వారు తిరిగి వచ్చువఱకు రెండవవారు పొం దుఃఖము కరుణమనఁజెల్లదు." (ఉపో. iii)

"నాయికా నాయకులలో నొకరు లోకాంతగతులై తిరిగి లభింపఁదగిన వారగుచుండ వారి రెండవవారు దుఃఖించినచో." (ఉపో. iv)

పైవాటిలో ఒకరు, వారు, అనేవి ఉభయలింగములుగా వ్యవహారములో ఏర్పడ్డ ఏకవచనాలు. గౌ వారములో బహువచనాలని చెప్ప వీలులేదు.

2. "ప్రత్యాశారూపకమైన రతి లేనిదే కరు విప్రలంభము పుట్టనేరదు." ఉపో. v.

2. అట్టి తలంపేమాత్రమున్న నతఁడు రాముఁ కాకపోవలసివచ్చును. ఉపో. vi.

4. 'విదూరస్థా' యనుదుపలోఁ బడవలయుగా సీత మఱియొక పదులోఁ బడుట కవకాశము లే గదా. ఉపో. vii, viii.

5. మాటకు మాటపెట్టి యొక మాడ్కి మాటిన మెత్తురేబుధుల్, అవ. 2. అత్తగార్లకు (5 వియ్యంకులు (10); కుదుపు (18) ఈ అర్థములో శ. ర. కొరుడివ్వలేదు; ఇది యర్థవాదముతే (22) బొత్తిగా (56);

అకస్మాత్తుగా (56), పిల్లలు (మనుష్య శిశువులు) 30, 60, 98; పెళ్లి (ఇది కొందరు గ్రాంథిక వాదుల మతములో గ్రామ్యము) 35, 45, 46 47, 50, 87, 95, 157; అట్టెయున్న (అట్టేఉండు అట్టేపెట్టు మొ. వలె) 81; ఐనట్లా లేనట్లా 83; నాప్రియసఖియునైన కౌసల్యా? (86); కురుపు (87); తన్నిమిత్తమెరయే (87): కాస్తి (100); మూసుకొనిరొ (72); ఈమె కాదూ? (73); కాట (77); తట్టెమదికి (107); ఇఱుమఱలు సైతము (49); వినికిడి (52); పైని (17); గిరులు మాత్రము (44); ఈమొండలగు (65); మాయు మొనరించు (66); ఐతిగాదు

(67); అఁ 65, 89; ఊఁ హూఁ, 82, 97; నన్ను వేఁపుచున్న దానవు (71): నాతపంబు ఫలమే [అవధారణము], 87, తోడిమ (50); నామీఁద నేయీ కనుబొమల ముడిపెట్టుట? (122); ఈమె యేనా యీ కౌసల్య? (91); అంటించు (92); కావి పంచెయున్ (94); ఇడిగో (109); ఎంతకాల మేడిపింపను? (78); స్తిమితపడుము (78, 80, 87); చూడను జూచినాఁడను తెలియను తెలిసినది (103); మాటుగనున్న (114); విఱుగుడు (114), కురిపించు (124, 156); గట్టిగా కౌఁగిలింపు (127); ఏమీ! రఘునాథుఁడే; (129); వినియోగపడియెఁ గదర (134)—దీనికి ప్రమాణము మా (1) చెల్మోహనరంగా పాట; (2) గదరానుమతీ. చెవులు (137)—ఇది అప్పకవి ప్రకారము గ్రామ్యము;

పాదపూరణాలు.

తలఁపన్ (8); లలిన్ (12); చూడఁగ (19); పరఁగ (40, 42, 88); ఇచ్చుఁచో (118).

వాక్యానన్వయము.

ఇచ్చట రతి యనఁగాఁ బునస్సమాగమాభిలాషారూపకము. (ఉపో. V.)

అధ్యయన హేతువులగుచు గడ్డములు నరసిన యీ తపోధనులకు (81).

శ్రుతిదుర్భగములు.

శాలనీక, ఈపెద్దది (20); నాకూఁతును పరిశోధించుటకు (89); ఈ రాజు కూఁతునందు (92).

ప్రాసగణాదులకోసము కకుర్కుర్తులు.

"పలుకు బడివేఱు పదపాటి వేఱు, రీతులును వేఱు యన్వయరీతివేఱు" (అవ. 2)

"రుదితముచ్ఛ్వాస ఫలదంబ యదియు మేలు"—67; రాముండు లేఁడన్నవార్త లేద" (68)—పైవాటిలో అవధారణమునకు ప్రయోజనము కనబడదు.

"సురక్షకాళి" (119), "సంపరిశుద్ధ" (86), పద్మగంధ లసితవారి...అవక్రకాండ లసిత పద్మపత్రము" (60), "క్ష్మాకాంతా తనయనైన (7), దండకాఖ్యవనవీధి, కాశికాఖ్యమాని, భూరిదరీదరస్థలుల బుస్సలు కొట్టుచు నిద్రవోవుని, భూరిఫణీంద్రదేహముల (39).

పూర్తిగాను (119), అరయఁగాను (153)—మొదలయినవి.

తెనుగు సంప్రదాయము.

"ప్రుగువుల్ మేయంగ (కాకులు), 36,—పక్షులు పండ్లను, పురుగులను తింటవిగాని మేయవు; మేత మేస్తవి.

"అనంటె యీరముల్"—62, ఈరము అనే మాట మాండలికము; ఇది యిప్పటికిన్ని మారాయలసీమలో వాడుకలో ఉన్నది. లతలగుంపు ఈరమని ఇచ్చటె వాడుక. ఇతరప్రాంతాలలో ఇది వాడుకలో ఉన్నట్లు కనబడదు. చెట్ల యీరము లని ప్రయోగించకూడ దేమో.

తెనుగులోని సంస్కృతసంప్రదాయము.

ఈ విషయమై భేదాభిప్రాయా లుండవచ్చును. సంస్కృత నిఘంటువులలోని యే పదాలనైనా తీసుకొని, వాటిని వ్యస్తముగానో సమస్తముగానో, వ్యాకరణావిరుద్ధముగా ఉంటేచాలును తెనుగులో వాడుకో వచ్చునని, కొందరి అభిప్రాయము. మేము మా అభిప్రాయముతో ఏకీభవింపలేము. అట్లే ఒక మాటకు మరి ఒకటి పర్యాయపదము గదా అని నిఘంటువుల నాధారముగా చేసుకొని వాడకూడదు. తెనుగులో కొన్ని సంస్కృతశబ్దాలు కొన్ని సంస్కృతసమాసాలు మాత్రమే కవులు వాడుకొన్నారు. అది ఒక సంప్రదాయముగా ఏర్పడినది. దానికి విరుద్ధముగా ఇప్పటివారు ప్రయోగిస్తే, ఆ ప్రయోగము నిఘంటు వ్యాకరణాలకు విరుద్ధము కాకున్నా అనౌచిత్యదోషానికి పాలవుతుందని మా అభిప్రాయము. అట్టివి కొన్ని—'అస్మదాది సహితలు' (80), గంభీరమాంసల స్తనితము (52), త్రసహరిణాక్షి (భీత) 56; జ్యాఘోష

రణితాస్త్రము (ఘోషము రణితము కానేరదు), పుత్రభాండము (101), శర్మములధాని (అంగారధాని, గోపాలధాని, రాజధాని, అగ్నిధాని, క్షురధాని, రజ్జుధాని, మొదలయిన ధానులున్నవిగాని, శర్మములధాని ఉంటుందా?) 120; ఆహా! 100, 108, 110 సంస్కృతిములోని అవ్యయాలను అదే రీతిగా తెనుగులో వాడవచ్చునా? 'ఆహా' కుమాక్షేపణము లేనుగాని, 'మాంత' నే నెంత గ్రూగడను (90)' అనే ప్రయోగము మాత్రము తెనుగు మర్యాద ననుసరించినది కాదు.

కవితాధార

ఉత్పల, చంపకమాలలు, శార్దూలమత్తే భవిక్రీడితములు, వ్రాసేటప్పుడు పంతులుగారికి కొంతధార కుదిరినది, కాని, కందములు, తేటగీతములు, ఆటవెలదులు, ధారాశుద్ధిగా వ్రాయడము అలవాటు కాలేదు. అందుచేత చాలా పద్యాలు కుంటుగా నడుస్తున్నవి. కొన్ని ఉదాహరణాలు—

క. ఉత్తరరామచరితముఁ బ్రయోగింతుమిదే (1)
గీ. శాంతయను కన్యఁబడసి దశరథవిభుఁడు) (2)
గీ. వనితల యెడలను గవుల వాక్కులందు (3)
గీ. జనకుఁడు మఱలి మిథిలకుఁ జనియెనిపుడె (4)
గీ. యాగమువలన మేమిట సాగినాము (7)
గీ. కలసి మనమున్న యాదినములుచనెఁగట.(11)
గీ. బృందము నివరియున్నంబుఁ బ్రీతితోడ (14)
క. ఏకార్య మయిన నొనర్తు రెప్పుడు సుజనుల్ (22)
గీ. వచ్చితి నిపుడు వాల్మీకి వలననుండి (29)
క. అలరులకంటె న్మృదువులు నై యుండు మహా (34)
గీ. సుజనులవలని చావును శుభకరంబ (37)
గీ. అల్ల దక్షిణపునగము లక్ష్య సుమ్ము (46)
ఆ. వె. అతిగభీరమగుట నగపడదు పయికి
కుతకుతమనుచు నుడుకు పుటపాకముగతి .
గురుతరమగు రామ శరుణరసము. (47) [(50)
గీ. శారదతపనుఁడుకేతకీగర్భందళముఁబోలె

ఆ. వె. ఇప్పుడు నవి విడువ వీఁస్థలంబు (62) మొదలయినవి.

అతివిస్తరము చాలును. పుటపుటకును ఇట్టి కుంటు పాదములు దొరలినవి. గణాలు కుదుర్చుకొనడానికి పంతులుగారు చాలా శ్రమపడి ఉంటారు. వచనము వ్రాస్తే బాగుండునే!

పంతులుగారు మిక్కిలి చిన్న విషయాలలోనే క్రిందా మీదా పడినారు. చూడండి. 'వసిష్ట' అనవలెనా 'వసిష్ఠ' అనవలెనా అని సందేహము. 'ష్ట' రూపాలను కొన్నిటిని తప్పొప్పుల పట్టికలో చెర్చి 'ష్ఠ' గా దిద్దుకోమన్నారు. కాని, కొన్ని చోట్ల దిద్దక విడిచినారు. (82, 152); 'షష్ట' (ఉపో. ix)అని వ్రాసినారు. 'షష్ఠి' అనిదిద్ద మరచినారు. ఈ పొరబాటుకు కారణము 'షష్టి=అరవై; షష్ఠి=ఆరోతిథి; షష్ఠ=ఆరో; అని వేర్వేరుగా ఉన్నవని గుర్తింపక పోవడమే. ఈ సందేహాలు నావంటి సాధారణుల కందరికీ కలుగుతవి. పంతులుగా రంతటివారికి కూడా కలిగినవి. 'సురచిరోకారుఁడు' (128) అని ప్రయోగించినారు. అరవవారినుంచి నేర్చుకొన్న తెనుగుపిల్లలు 'వరవీణా మృదుపాణి, వనరుహలోచనురాణి, సురచిరబంభరవేణి' అఁ పాడుతారు. అట్లే చాలామంది పండితులు కూడా అనడము వ్రాయడము కలదు.

విమర్శించడానికి దొరకి దొరకి ఈ ఉత్తరరామచరిత నాటకమా మీకు దొరికింది? దీనిమీద వినియోగించిన కాలము మరేదయినా మంచి పనిమీద వినియోగిస్తే బాగుండునే అని నా స్నేహితులు కొందరు నన్ను మందలించినారు. కాని, అనేక ప్రయోజనాలు ఏకదేశములో లభించడముచేత ఈ అవకాశమును వదలుకొనడానికి నామనస్సొప్పుకో లేదు. 1. లోకములో అనేకులు గ్రాంథికవాదులమని చెప్పుకొని, వ్యావహారికవాదులను బహిరంగముగాను చాటుగాను మాటతో నిందిస్తూ, చేతితో అపకారము చేస్తూ ఉన్నవారున్ను, వారి అనుయాయులై, వారి అగ్రహానికి ఎక్కడ పాత్రుల

కూతామో అని దిగులుపొందేవారున్నూ, ఎన్నో గ్రంథాలు వ్రాస్తున్నారు. సాధారణముగా ఇట్టి అన్ని గ్రంథాలలోను గ్రాంథికభాషామర్యాదల నతిక్రమించడము, వ్యావహారికభాషను విచ్చలవిడిగా, అప్రయత్నముగా ఉపయోగిస్తూ ఉండడము జరుగుతున్నది. అట్టివారు చేస్తూఉన్న దోషాలన్నీ ఈ ఆంధ్రీకృతోత్తర రామచరిత్రములో గుమిగూడి సూక్ష్మీకరించినవి. దీనిని పట్టుకొంటే ప్రతిగ్రంథమును వేర్వేరుగా విమర్శింపవలసిన పని పడదు. (2) గ్రాంథికవాదులలో పంతులుగారు అగ్రేసరులు. ఇదిగాక, మరెవ్వరయినా అయితే 'చిత్తము, చిత్తము, పొరపాటు కలిగినదండి, దిద్దుకొంటాము; 'ప్రమాదోధీమతామపి' అని ఉన్నదిగదా అండి. మేము కూడా మనుష్యులమే. తప్పులు కలుగకుండా ఉంటవా' అని తప్పించుకొంటారు. కాని, పంతులుగారికి నిద్రలో కూడా గ్రాంథివాదుల మీద కత్తులు నూరుతూ ఉన్నట్టే కలవరింత. ఈ విషయములో శ్రీవారికి గల పట్టుదల మరేవిషయములో నయినా ఉంటే, దేశానికెంతో మేలుకలిగి ఉండేది. మొన్న మొన్న ఆంధ్రయూనివెర్సిటీ కమీషనులో తెనుగుకు ఎక్స్‌పర్టు సభ్యులుగా ఒక కాలేజికి పోయి, ఒకానొక పండితునితో 'ఏమండీ, ఇక్కడికి పర్లాకిమిడి గాలి ఏమయినా సోకిందా'' అని అడిగినారట. పర్లాకిమిడి కొండగాలివల్ల శరీరానికి మంచి బలము కలుగుతుందని పంతులుగారికి తెలియదు. కొండగాలి తీవ్రమైన స్వాతంత్ర్యబుద్ధిని, సాహసమును, ధైర్యమును వృద్ధిచేస్తుందని చరిత్ర చదువుకొన్న వారికి తెలుసును. స్వతంత్రబుద్ధిని కోరి చంపుకొన్నవారు, ఇతరుల స్వాతంత్ర్యమునకు కూడా నిరోధము కలిగించవలెనని ఉబలాటపడతారు. పరిషన్నిఘంటు నిర్మాణము మందగించడానికి కూడా పంతులుగారి వ్యావహారిక భాషాద్వేషమే కారణమని వినికిడి. (3) మొదటిలో వ్యావహారిక భాషావాదానికి నిష్కారణముగా అడ్డుతగిలి, లోకమును భ్రమపెట్టి, దేశాభివృద్ధికి పంతులుగారు తీరరాని అపకారము చేసినారు. అప్పుడూ, ఇప్పుడూ కూడా ఆంధ్రవిశ్వవిద్యాలయములో తమకుగల పదవిని దుర్వినియోగము చేస్తూ అనేకవిధాల భాషకు అపకారము కలుగజేసి, చేస్తున్నారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తులో ఉభయభాషాప్రవీణ పరీక్షాప్రణాళికను తగలబెట్టినది వీరే. ఆవిషయమున వీరు చేసిన కృషివల్ల తెనుగుభాషకు ప్రాధాన్యము సంపూర్ణముగా తొలగిపోయినది. విద్యాభివృద్ధి విషయములో వీరు చేసిన ఘనకార్యమిది. (4) ఆంధ్రవిశ్వవిద్యాలయ కమిషనులో ఎక్స్‌పర్టు సభ్యులుగా వేసుకొంటే, వీరు తమ రిపోర్టులో తెనుగు బాగా వ్రాయడానికి ముఖ్యోపాయము అరసున్నలను, బండిరాలను సరిగా వాడడము నేర్చుకొనడమే అని ఒక్క మాటతో తీర్పు చెప్పినారు ఈ ఉపాయమును మొదటినుంచీ అందరు పండితులున్నూ ఉపదేశిస్తున్నదే. అందుకోసమే కళాశాలలలో తెనుగు అభివృద్ధికి రాకుండా ఉండడము.

కవులకూ, వ్యాసకర్తలకూ విన్నపం

ప్రబుద్ధాంధ్రకు ఎవరూ పద్యాలు పంపవద్దు. ఆంధ్రోద్యమమూ, చరిత్రా, సంఘాచారాలూ, మతాలూ నగరాలను గురించిన వ్యాసాలూ, ఏకాంకనాటకాలూ, కథలూ విమర్శలూ మొదలయినవి వచనంలోనే కావాలి. ప్రకటించని రచనలు పోస్టుబిళ్లలు పంపినగాని తిరిగి పంపబడవు. కర్తలకు వారి రచనపడిన సంచిక మొదలు ౧౨ సంచికలు పంపుతాము. తరుచు రాసేవారికి ఎప్పుడూ పంపుతాము. ఇంతే మేము చెయ్యగల సత్కారం.

ఇట్లు వ్యవస్థాపకుడు.

వ్యాఖ్యానములు

సంధానకరణి

ప్రబుద్ధాంధ్రను ప్రశంసించివట్టే ప్రశంసించి (౨౯—౧—౧౯౩౮) గోల్కొండ పత్రిక చివరికి యిలాగ వొక పెద్ద భారం మోపింది.

"సమస్తాంధ్రుల యభివృద్ధిని గోరె ప్రబుద్ధాంధ్ర పత్రిక యీ నిజాము రాజ్యము లోని ౭౦ లక్షల ఆంధ్రుల యభివృద్ధిని గూడ గమనించుగాక యని కోరుచున్నాము"

గోల్కొండ వొకప్పుడు దక్షిణాపథంలో అపారప్రాభవం అనుభవించిన గొప్ప రాజ్యం. అనేక శత్రురాజులను చెరపట్టీ, పారదోలీ, సంహరించీ— పరభయంకర మైన మహోన్నతదుర్గం. ఆంధ్రదేశానికి చాలాకాలం రాజధానిగా వుండిన మహానగరం. దక్షిణాపథ చరిత్రలో విశేషభాగం ఆక్రమించిన ఘట్టం.

గోల్కొండ అనగానే అనేక సుఖమయస్వప్నాలు కలుగుతాయి. అనేక సన్నివేశాలు జ్ఞాపకం వస్తాయి. మనస్సు ఏమిటో గుబగుబలాడి పోతుంది.

ఆపేరిట వెలసిన యీ పత్రిక యిప్పుడు నిజామాంధ్ర భూభాగానికి శోధనజ్యోతిగా వుంది. పెన్నిధిగానూ వుంది.

అలాంటి వొక గొప్ప పత్రిక ప్రబుద్ధాంధ్రవంటి చిన్నపత్రికమీద యిలాంటి భారం మోపిం దంటే అక్కడి ఆంధ్రుల ఆవేదన యేవిధంగా ముప్పిరిగొంటోందో చెప్పకుండానే తెలుస్తోంది.

అయితే;

నిజాము రాజ్యంలో ఆంధ్రులు డబ్బయి లక్షల మంది వుంటే వుండవచ్చు. అది చాలా పెద్ద సంఖ్యే కావచ్చు. వారూ, మనమూ వొకరి కొకరం సరిహద్దులోనే వుండవచ్చు; కాని వారికీ మనకీ సమ్మంధం యేమిటీ?

వారిదీ మనదీ సంప్రదాయం వొకటే అంటే నిజమే. భాష వొకటే అంటే సత్యమే. జాతి కూడా వొకటే అంటే అదిన్నీ వాస్తవమే; కాని యేదో వొక ప్రతికూలశక్తి వారిని మనని చెరో వేపుకీ జబ్బలు పట్టుకు లాగేస్తోంది.

మనని విడిచిపెడితే వారికి ఆంధ్రత్వం లేదు. అలాగే వారిని విడిచిపెడితే మనకిన్ని ఆంధ్రత్వం లేదు; కాని వారికీ మనకీ యిప్పు డనుబంధం యేమీ కనపడ్డం లేదు. వారు యీవేపుకి వచ్చా రంటే యేదో కాకతాళీయం. మనం ఆవేపుకి వెళ్లా మంటే కూడా యేదో మార్గవశం.

సంప్రదాయాలూ, భాషా, జాతీ వేరయినా అరవలకీ మనకీ వున్నంత కలయిక అయినా వారికీ మనకీ వున్నట్టు లేదు.

కాని చరిత్ర విప్పండి. ఇప్పుడు నిజామాంధ్ర భూభాగం అనిపించుకుంటూవున్న ఆప్రదేశం ఆంధ్రదేశాని కంతటికీ వొకప్పుడు గుండెకాయ. ఇప్పుడు ప్రత్యేకజాతిగా కనపడుతూ వున్న ఆడబ్బయి లక్షల ఆంధ్రులూ, వొకప్పుడు జగజ్జ్యోతి అనిపించుకున్న మహాసామ్రాజ్యాన్ని నిర్మించి, పాలించి, దేవేంద్రవైభవం అనుభవించిన మహాపురుషుల సంతతివారు.

కొన్ని శతాబ్దుల కాలం అఖిలాంధ్రజాతి యొక్క చైతన్యం అంతా అక్కడ కేంద్రీకరించి వుండింది.

ఇప్పటికీ ఆంధ్రజాతి చరిత్రలోని వొక గొప్ప అధ్యాయం నివురుగప్పిన నిప్పులాగ అక్కడ నిక్షిప్తమై వుంది.

తెలుసుకోగలిగితే యిప్పు డిక్కడా, అక్కడా కూడా యేదో విధంగా —వైశాఖమాసపు సెలయేటిలాగ ముందుకి సాగగలుగుతూ వున్న ఆంధ్ర

జీవనవాహినికి జన్మస్థానమూ, సంగమస్థానమూ వొక్కటే గాని రెండు కాదు.

కాని వారికీ మనకీ ప్రభుత్వాలు వేరయినాయి. భౌతికసంబంధం శాశ్వతంగా తెగిపోయింది.

అయితే మాత్రం?

సంప్రదాయాన్ని యెవరు చీల్చగలరూ?

రక్తసంబంధాన్ని యెవరు భేదించగలరూ?

జాతిని యెవరు విడగొట్టగలరూ?

ధిక్!

ఎక్కడి మాట యిది? ఎక్కడి స్వప్నప్రలాపం యిది?

అంతా అడవిని గాసిన వెన్నెల. బూడిదలో పోసిన పన్నీరు.

ఇప్పుడు వారి ఆశ లటూ, మన ఆశ లిటూనూ.

వారి మొగం అటూ, మన మొగం యిటూనూ.

అక్షరాలా వారు వేరూ, మనం వేరూనూ.

అయితే యింతేనా?

నిరవధిక మైన ఆంధ్రత్వం అంతా వొక్కటి కాలేదూ?

అక్కడి ప్రభువుని వారూ, ఇక్కడి ప్రభువుని మనమూ కొలుచుకుంటూనే సమయం వస్తే కోవ వొక్కటే అని అనిపించుకోలేమూ?

నిరాశ అక్కర్లేదు.

ఎక్కడా ఆకు అల్లాడకుండా, రెండో కంటి వాడికి తెలవకుండా ఎక్కడెక్కడ చెదిరిచెదిరి వున్న ఆంధ్రజాతీ వొక్కటి అయిపోడానికి తగిన సాధనం వుంది.

వొకప్పుడు భరతవర్షాకాశం అంతటా జిగిజిగ్గా మెరిసిన ఆంధ్రతేజస్సుని మళ్లీ తళుకుతళుకు మని పించే నికషం వుంది.

అదే ఆంధ్రోద్యమం.

ఆంధ్రోద్యమానికి ఏ ప్రభుత్వంతోటీ సమ్మంధం లేదు. ఏ ప్రభుత్వంతోటీ సంఘర్షణ లేదు.

ఆంధ్రోద్యమం ఆంధ్రరక్తాన్ని మొదట శుద్ధి చేసి, తరవాత వుడుకెత్తిస్తుంది. ఆంధ్ర సంప్రదాయాన్ని మున్ముందు సంస్కరించి పిమ్మట పురియెక్కిస్తుంది. ఆంధ్రజాతిని ప్రథమంలో మళ్లీ నిర్మించి అనంతరం గద్దె యెక్కిస్తుంది.

ఆంధ్రహృదయాని కది సూదంటురాయి.

ఆంధ్రజీవనాని కది సంధానకరణి.

ఆంధ్రులు నిజాము రాజ్యంలో వుండవచ్చు. మైసూరురాజ్యంలో వుండవచ్చు. తమిళదేశంలో, బొంబాయిలో, మధ్యపరగణాలలో, బర్మాలో, చివరికి ఆఫ్రికాఖండంలో—ఎక్కడైనా సరే మోల మధ్య కూడా వుండవచ్చు; కాని ఆంధ్రోద్యమం వారి అందరిదృష్టి వొక్కచోట కేంద్రీకరిస్తుంది. వారి నందర్నీ వొక్క సూత్రాన్ని బంధిస్తుంది.

ఆంధ్రోద్యమం మహిమ అలాంటిది.

వొకప్పు డది తన ప్రభావం చూపించింది. ఎక్కడెక్కడ వున్న ఆంధ్రుల్నీ వొక్క కంచందగ్గిరికి, వొక్క మంచంమీదికి చేర్చసాగింది.

ఖండఖండాలై చెదిరిచెదిరి వున్న ఆంధ్రప్రకాశాన్నంతటినీ వొక్క తేజఃపుంజంతో అతకసాగింది.

ఓహో! ఎలాంటి సన్నివేశం అదీ! అప్పుడే ప్రారంభ మైన ఆ ఆంధ్రైక్యం ఎంత సురభిళమై ఎంత మధురమై, ఎంత తేజస్వంతమై ఎంత ఆశాజనకంగా వుండేదీ?

కాని అదంతా మనమే చెరుపుకున్నాం.

మన చేతులారా మనం లేస్తూలేస్తూ వున్న ఆ దివ్యసౌధాన్ని నేలమట్టం చేసేసుకున్నాం.

సుడిగుండాలతో నిండి వున్న కాంగ్రెస్సు వెల్లువలో పడి మనం యెక్కడెక్కడికో కొట్టుకుపోయాం.

ఇరుగుపొరుగువారు—తోటివారు తాము తాముగానే వుంటూ, కాంగ్రెస్సుని యథోచితంగా మాత్రమే అనుసరిస్తూ వుండడం చూస్తూనే కూడా మనం సర్వనాశం తెచ్చిపెట్టుకున్నాం.

అయినా ఆంధ్రోద్యమం యింకా స్మృతిపథం దాటిపోలేదు.

ఆంధ్రజాతియొక్క పునరున్నతిసాధనం యింకా వినష్టం కాలేదు.

ఇంకా నిరాశపడనక్కరలేదు.

కాని ఆంధ్రుడు వొక్కమాటు నిలిచి, కంట్లమసకలు తుడుచుకొని, తా నిప్పు డెక్కడ ఏ స్థితిలో వున్నాడో నిదానంగా చూసుకుంటే చాలు.

"దుడుంగుమంటే గేలం"

అప్పుడు మనవాళ్లు రాయలసీమవారిని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనుంచి "పోతే పోండి. వుదరిస్తారా యేమిటి?" అన్నారు. ఇప్పుడు "అయ్యో! మీరు లేకపోతే యెలాగా? విధిగా వచ్చితీరాలి" అంటున్నారు.

అప్పుడా నిర్లక్ష్యాని కేమి కారణమో? ఇప్పుడీ బేలతనాని కేమి హేతువో?

అప్పుడు మనవాళ్లు ఏఅరవవారి వోటుబలంతో విశ్వవిద్యాలయాన్ని విశాఖపట్నానికి గెంటుకు వచ్చారో ఆ అరవవారి సాయాన్నే రాయలసీమ యువకులు ఇప్పుడు పొందితే "ఎబ్బే! తప్పుతప్పు. జాతికి అప్రతిష్ఠ కాదూ?" అంటూ పెదవులు విరుస్తున్నారు.

ఇలాంటి వన్నీ చూసే రాయలసీమవారు సర్కారులమీద అనుమానపడితే—కాదంటే మాత్రం యేమి లాభమూ?

ఇంతకీ:

రాయలసీమవారు ఆంధ్రవిశ్వవిద్యాలయంలోకి రాకపోతేనూ, మద్రాసు విశ్వవిద్యాలయంలో వుండిపోతేనూ వచ్చే ఆపత్తేమిటీ?

అప్పుడు మనవాళ్లు రాయలసీమవారిని తోసేసే కలిగే నిజమైన ఫలితం యేమిటో తెలవకుండానే "గెలిచాం" అనుకున్నారు. రాయలసీమవారు కూడా మద్రాసు విశ్వవిద్యాలయంలో వుండిపోతే వచ్చే లాభం యేమిటో వూహించుకోకుండానే "సర్కారులవారికి బుద్ధి తీరా" మనుకున్నారు.

కాని వుద్దేశాలేమైనా, ప్రయత్నాలెలాంటివైనా జరిగింది మాత్రం చాలా మంచి పని.

ఏమంటే?

అరవవారిలో కొందరు అణ్ణామలైవిశ్వవిద్యాలయంలో చేరారు కొందరు మద్రాసు విశ్వవిద్యాలయంలో వుండిపోయారు. అలాగే కొందరాంధ్రులు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చేరితే తతిమ్మావారు మద్రాసు విశ్వవిద్యాలయంలో యెందుకు వుండిపోగూడదూ?

మద్రాసు విశ్వవిద్యాలయంలో పదకొండు జిల్లాల ఆంధ్రుల కాయకష్టమూ వుంది. దాన్ని అరవవారి కొక్కరికీ భుక్తపరచడం యేం వివేకమూ?

మద్రాసు ఆంధ్రదేశంలోది; కాని అరవదేశంలోది కాదు. ఆంధ్రనగరం; కాని అరవనగరం కాదు. అది ఇంగ్లీషువారికి ఆంధ్రరాజు ఇచ్చింది; కాని అరవరాజు ఇచ్చింది కాదు. అక్కడి ఐశ్వర్యంలో, వర్తకంలో ఆంధ్రుల పాలెక్కువగా వుంది; గాని అరవవారిది కాదు.

ఇలాంటి స్థితిలో మన కక్కడ పలుకుబడి లేకపోయినందుకే మురపిల్లవలసివుండగా మద్రాసు విశ్వవిద్యాలయాన్ని పూర్తిగా అరవవారిపరం చెయ్యడం యేం తెలివీ?

సర్ రాధాకృష్ణయ్యగారు రాయలసీమవారే. వారు జగత్పండితులే. మహానుభావులే. వారు ఆంధ్రజాతికి భూషణమే. వారు ఆంధ్రైక్యం కోసమే ప్రయత్నిస్తూ వుండడం వాస్తవమే; కాని వారేనా యీ సంగతి ఆలోచించవద్దూ?

ఇవాళ ఓఢ్రులికి యేమీ అధిక్యం లేకపోయినా వారు గంజాంమండలంలోనుంచి చాలా ఆంధ్రభూభాగాన్ని కొట్టుకుపోతూ వుంటే మనం తెల్లమొగాలు వేసుక్కూచున్నాం. ఇప్పుడు మద్రాసువిశ్వవిద్యాలయాన్ని అరవవారి చేతుల్లో మనం స్వయంగానే పెట్టి—ఆంధ్రరాష్ట్రం యేర్పడ్డమే వసే అప్పుడు మద్రాసును గురించి. తగాదాని

గురించీ మనం యేమి చెయ్యాలి? ఏమి చెయ్య గలం?

కనక—తొందరపడడం మంచిది కాదు. ఇప్పుడు రాయలసీమవారు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చేరకపోవడం ఉత్తరోత్తరా మనకి లాభకరమే గాని అపాయకరం కాదు. శాసనసభలో బిత్తిరీచేసి మెజారిటీ సంపాదించి వారి నాంధ్రవిశ్వవిద్యాలయంలోకి తీసుకురావడం పొరుగువారితో మనం వ్యవహరించవలసి వచ్చినప్పుడు తప్పకుండా వుండవలసిన బలాన్ని కుంగదీసుకోడం గాని మరొకటి కాదు.

అయితే: ఇప్పుడు రాయలసీమవారూ మనమూ నిజానికి ఎడమొగం, పెడమొగంగా వున్నాము. దీనికి కారణాలు ఇక్కడ అతితెలివీ, అక్కడ అమాయకత్వమూనూ. ఇక్కడ "ఎప్పటి కయ్యది ప్రస్తుత" మనే నీతి అక్కడ అనుమానమూనూ.

వాస్తవంగా ఈవైమనస్యాలు జాతికి వేరుగులు. ఇవి మన ప్రతిభకి కళంకం కలిగిస్తున్నాయి. మన పతనానికి దారి తీస్తున్నాయి.

ఇవి పోవాలి. నిజమే.

సర్కారులవారూ, రాయలసీమవారూ ఆంధ్రులైపోవాలి. వాస్తవమే.

అయితే దీనికి సాధనం ఆంధ్రవిశ్వవిద్యాలయం కాదు. ఆంధ్రోద్యమం.

మన మెప్పుడు దుడుంగుమంటే గేలం వెయ్యకుండా దూరదృష్టితో వ్యవహరిస్తామో, యెప్పుడు నిర్వికారబుద్ధితో ఆంధ్రమహాసభని మళ్లీ సమకూర్చుకుంటామో అప్పుడు మనం వొక టయిపోతాము. ఆంధ్రజాతి అంటే అప్పుడు ఇరుగుపొరుగుల వారికి భయమూ భక్తీ కూడా పుడతాయి.

ఎలాంటివారికి రాష్ట్రం సిద్ధిస్తోంది?

రావుసాహేబు గిడుగు వేంకటరామమూర్తిపంతులు గారు ఇలా చెబుతున్నారు.

"ఓఢ్రులు పర్వతవాసులు. వీరెప్పుడూ సముద్ర తీరాల్లో నివసించి యెరగరు. ఎప్పుడూ వొకచోట కలిసిగాని, వొక ప్రభుత్వంలో గాని వున్న జాతి వారు కూడా కారు. అసలు వీరొకచోటే వుండే వారు కారు. "ఒడ్డర" అనే మాటకి తిరిగేవా రనే అర్థం. సైమనుకమిషను కూడా వీరిని చెదిరి చెదిరి వుండేవా రనే చెప్పింది. రాష్ట్రానికి పట్నా లవసర మని వీరిప్పుడు బరంపురం, ఛత్రపురం మొదలైన పట్నాలు అడుగుతున్నారు; గాని అసల్లో వీరికి పట్నాలు లేవు. బరంపురం తెనుగు దేవాంగులు కట్టింది. ఓఢ్రరాజులు కూడా పట్నాలు కట్టించలేదు. కటకం, బాలసూరు, పూరీ ఈజిల్లాలు మాత్రమే అసలు ఓఢ్రదేశం. పర్లాకిమిడిలో కాలేజీ వుందంటే అది వెయిలరుగారి ప్రసాదం. రసూలుకొండ అంత పట్నం అయిందంటే రస్సెలుగారే దానికి కారణభూతులు. ఓఢ్రులు పరమఅనాగరికులు. మిధునపురంలో వున్న ఓఢ్రులు బంగాళీల సహవాసంవల్ల నాగరికులైనారు. వారు ఓఢ్రులకు ప్రత్యేకరాష్ట్రం అక్కరలే దనేశారు. గంజాం ఓఢ్రులు తెనుగువారి సంపర్కంవల్ల కటకు ఓఢ్రులకంటె వేయింతలు బుద్ధిమంతులైనారు. మిధునపురఓఢ్రుల లాగే వీరుకూడా ఈదరిద్ర, అనాగరిక, ఓఢ్రరాష్ట్రం అక్కర్లే దని అనవలసింది"

సంఖ్యలో నైనా ఓఢ్రులు మనలో సగం. అలాంటివారికి ప్రత్యేకరాష్ట్రం వస్తోం దంటేనూ, పైగా అన్నివిధాలా వారి కంటే అర్హులమై వున్న మనకి రాలే దంటేనూ ఏమిటి అర్థం?

దొరతనంమీద ఆరోపణలు చేయడంలో ఔచిత్యం కనపడదు. మద్రాసురాష్ట్రాన్ని విడతీయ్యకపోయినందువల్ల వారికి పరిపాలనలో ఏమీ ఆటంకాలు కలగడం లేదు. అయితేమాత్రం పాలితుల సౌకర్యాలు గమనించవద్దా అంటే మన విషయం మన మేనా చూచుకున్నప్పుడు గదా ఈఆక్షేపణ చెయ్యడానికి మన కధికారం? ఖిలాఫత్తుమీద

వుండినంత శ్రద్ధ మనకి ఆంధ్రోద్యమంమీద లేకపోయింది. బార్డోలీమీద వుండినంత పూనిక మనికి ఆంధ్రరాష్ట్రంమీద లేకపోయింది. ప్రకృతపు అస్పృశ్యతానివారణోద్యమంలో వున్న ఆసక్తిలో సహస్రాంశమేనా మద్రాసురాష్ట్రంలో మనజాతి అనుభవిస్తూ వున్న అస్పృశ్యతను గురించి మనకి లేదాయె. పైగా ఓఢ్రుల్లో జమీన్దార్లూ, నాయకులూ, సంపాదకులూ — అందరూ వొక్కతాటిమీద నిలిచి గంజాం, విశాఖపట్టణం జిల్లాలలోనుంచి విశేషాంధ్రభూభాగాన్ని కొట్టుకుపోవడానికి కుమ్మక్కు చేసుకుంటూవుంటే ఆవిషయంలో ఆజిల్లాలఆంధ్రులు ప్రత్యేకసభలు చేసీ, ప్రత్యేకప్రతిఘటనలు చేసీ తంటాలుపడవలసి వచ్చింది; గాని అఖిలాంధ్రమహాజనులకి చీమ కుట్టినట్టైనా లేకపోయె. అనేకవిషయాలను గురించి ఆంధ్రమహాసభాస్థాయి సంఘాన్ని సమకూర్చాలని కార్యదర్శి యెన్నిమాట్లు వాయిదాలు వేసినా మన కాంగ్రెస్సు అంధభక్తి దాన్ని జరగనివ్వడం లేదాయె. ఇలాంటి పరిస్థితుల్లో మనకి రాష్ట్రం యెలా వస్తుందీ? మద్రాసుకౌన్సిల్లో తీర్మానం నెగ్గించడం వొక్కటేనా యిందుకు మార్గం? అదేనా బొబ్బిలిరాజావారిని ప్రతిఘటించడానికి కాని నిజంగా రాష్ట్రంమీద శ్రద్ధ వుండా?

ఓఢ్రులు తమకి ప్రత్యేకరాష్ట్రం సంపాదించుకోడానికి మాత్రమే ప్రయత్నించడం లేదు. ఆంధ్రప్రదేశాలను కలుపుకోడానికి వారు ప్రస్థానం చేస్తున్నారు. వారి ప్రయత్నం సఫలం కాబోయేటట్టుంది. మనం ఆంధ్రరాష్ట్రం తెచ్చుకోలేకపోతే పోయాము; మన ప్రదేశాల నేనా మనం రక్షించుకోవద్దూ? ప్రతికూలప్రయత్నాలు జాతిపరంగా సాగేటప్పుడు ప్రతిఘటనప్రయత్నాలు గూడా అలాగే జరగనక్కర్లేదూ?

మన వారి ప్రవృత్తి నేమనాలో తోచడం లేదు. దానికి వొకరి అడుగులలో అడుగులు వెయ్యడం— వొకరి ననుసరించిపోవడం తప్ప స్వతంత్రత వున్నట్లు లేదు. శుష్కరాజకీయాందోళనం వచ్చాక ఈ స్థితి మరింత విషమించింది. రౌతుకొద్దీ గుఱ్ఱం అన్నారు పెద్దలు. మన యీ ఔదాసీన్యం చూసి ఓఢ్రులు మరింత విజృంభిస్తే ఆశ్చర్యమేమిటి?

వేదికలు — పత్రికలు

రాత బాగుండాలి

కైలాసవాసి చల్లా శేషగిరిరావుగారి జ్ఞాపకార్థం మిత్రులు ఏర్పరచ తలుచుకున్న వక్తృత్వ, వ్యాసలేఖకత్వ పరీక్షలను సమర్థిస్తూ చేతిరాతని గురించి శ్రీ పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఫిబ్రవరి 1 వ తేదీ ఆంధ్రపత్రికలో యిలా రాస్తున్నారు.

'లిపి' యరువదినాలుగు కళలలో నొకటి. లిపిజ్ఞానము, లేఖనము, ప్రాచీన విద్యలలో ముఖ్యమైనవి. 'పాణిన్యాచార్యులు — కాదు. 'శాకటాయనుడు' కూడ లిపి విశేషముల గూర్చి చెప్పియున్నాడు. చాణక్యుడు తన యర్థశాస్త్రమున లేఖన, లేఖకోద్యోగుల పరీక్షలగూర్చి సూచించియు

న్నాడు. 'మను' యాజ్ఞవల్క్యాదులు లేఖనముల గూర్చి చెప్పియున్నారు. చాణక్యాది రాజులు శాసన లేఖకులకు దామిచ్చిన దానములలో భాగములు బంచిపెట్టి యున్నారు. ఆంధ్రుల లిపి 'గౌతమీ పుత్రశాతకర్ణి, నుండి క్రమముగా నెట్లభివృద్ధి నొందినదియు శాసనశోధకులకు విదితమే. మహమ్మదీయ ప్రభువులు, హైందవ ప్రభువులు గ్రంథ లేఖకులకు, పసదనంబు లొసగియున్నారు. ప్రాచీనులు తాళపత్రములపైనేగాక భూర్జర పత్రములపై, శ్రీతాళ పత్రములపై, ప్రాచీనములగు కాగితములపై తమ లిపికళను వృద్ధిపరచిరి. మహాకవులు తమ గ్రంథములను లిఖించినవారి పేరులు తమ గ్రంథములలో శాశ్వతపరచిరి. ఆ లేఖకులు నేటి ముద్రాక్షరములను మరపించునట్లు వ్రాసి యున్నారు. వైదికపు పెండ్లికుమారుని బరీక్షించుటలో 'జంఠములు' వడకుటయు, లౌకికపు పెండ్లికుమారుని బరీక్షించుటలో దస్తూరీపరీక్షయు పదునెనిమిదవ శతాబ్ద మధ్యము వరకు నాంధ్రదేశమున సాంప్రదాయ సిద్ధముగా నుండెడివి. ఇంతయేల 1905 సం॥రము వఱకు 'మెట్రిక్యులేషన్' పరీక్షకాగానే దస్తూరీ పరీక్షను గవర్నమెంటువారే చేయుచుండిరి. ఆ పరీక్షయందు తీర్ణులైనవారికే గవర్నమెంటు నౌకరీ దొఱకుచుండెడిది. మన పరిశ్రమలు, మనకళలు పాశ్చాత్య యంత్రసాధనములు వచ్చినపిమ్మట నెట్లో త్వరముగా నశించినవో, 'ముద్రాక్షరములు, టైపు' యంత్రములు వృద్ధినొందుటచే లిపికళయు బూర్తిగ నశించుచున్నది. స్కూళ్లయందు 'కాపీ వ్రాయించుట' వ్రాయుట నామమాత్రమైనది. పాఠశాలలోని కాపీలు వ్రాయించుటలోని యనాదరణమే ఇందుకు ముఖ్యకారణము. పూర్వము లేఖకోద్యోగిగా నుండువాడు తనదస్తూరీని యోగ్యతా పత్రముతో సమానము చేసికొనుచుండువాడు. ఇప్పటి లేఖకోద్యోగమునకు 'టైప్ మిషను' నాకున్నదని దరఖాస్తులో వ్రాసికొనుచున్నాడు. రెండేండ్లనాడు, 'పి. సి. రాయిగారు మద్రాసున నుపన్యసించుచు నేటి బి. ఏలు—లేఖకోద్యోగమునకు—యిరువది రూప్యములకు—అని టైపుమిషనుపై నెట్లు వ్రేళ్లకొట్టునో అట్లభినయించి సభికులను నవ్వించినారు. ప్రతి పత్రికలోను 'విలేఖకులకు హెచ్చరిక' అను శీర్షికతో స్పష్టముగా నక్షరము లుండవలెననియే వ్రాయబడుచుండును. కాన శేషగిరిరావుగారి స్మారకచిహ్నమగు వ్యాసపరీక్షలో 'లిపి' పరీక్షగూడ నొకయంశముగా జేర్చిన మంచి దని నా యభిప్రాయము."

శ్రుత పాండిత్యము

శ్రీ అయ్యంకి వేంకటరమణయ్యపంతులుగారు ఫిబ్రవరి ౧౭ వ తేదీని పెదపాలెంలో జరిగిన గుంటూరు మండల గ్రంథాలయమహాసభకు అధ్యక్షత వహించి చదువు రాని వారికి జ్ఞానం కలిగించవలసిన ఆవశ్యకాన్ని గురించి తమ ప్రారంభోపన్యాసంలో యిలా సెల విచ్చారు.

"అయితే మనమేమో "ఉప్పు లేక ముప్పందుము తాగినా" మని తలంపవద్దు. చేసినపని స్వల్పము. చేయవలసినపని హిమాలయ పర్వతమంత గలదు. అసలు గ్రంథాలయోద్యమముయొక్క స్వరూప స్వభావము లెవ్వి? దానియొక్క ఉపయోగమెవ్వరికి? సర్వజనులకు విజ్ఞానవ్యాప్తిని గలుగజేసి, వారి జీవయాత్ర పవిత్రవంతముగను పురుషార్థసాధకముగను చేయుటయే ఈ యుద్యమముయొక్క పరమార్థము. ఇట్టి మహత్తరమైన ఆదర్శము గలిగియున్న గ్రంథాలయముయొక్క ఉపయోగమును జను లందరును పొందునటులు జూడవలయును.

మా దృష్టవశముచేత మనదేశమందున్న జనసంఖ్యయందు నూటికి తొంబదికంటె ఎక్కువమంది నిరక్షరకుక్షులు. ఇట్టివారికి గ్రంథాలయము లేమి జేయును? గ్రంథములు చదువుకొనగలిగిన జనులకు వానిని అందిచ్చుటతోడనే గ్రంథాలయముల ధర్మము నిర్వర్తింపబడినదా? లేదు. గ్రంథములను చదువుకొనలేని వారికి గూడ విజ్ఞానవ్యాప్తిని గలుగజేయుటయే

గ్రంథాలయముల కర్తవ్యము. అందుచేతనే ఒక గ్రంథాలయముయొక్క గొప్పతనము అందుండు గ్రంథముల సంఖ్యనుబట్టి గాక, ఆ గ్రంథాలయము నందలి గ్రంథములను ఎంతమంది ఉపయోగించు చున్నారు ; ఆ గ్రంథాలయము ఎంతమందికి విజ్ఞాన వ్యాప్తిని గలుగజేయుచున్నది: అను విషయములను బట్టి నిర్ణయింపవలసి యుండును. గ్రంథములను, పత్రికలను చదువుటమూలముననే గాక, కంటితో చూచుటవలనను, చెవితో వినుటవలనను గూడ చదువురాని జనులకు జ్ఞానవ్యాప్తిని గావించవచ్చును. మనదేశమున ప్రాచీన కాలమునుండియు శ్రుత పాండిత్యముయొక్క మహత్తు బాగుగా వ్యాపించి యున్నది. ఆ కాలముననే గాక పాశ్చాత్య నాగరికత వ్యాపించిన ఈకాలమున గూడ, శ్రుతిమూలకముగ జ్ఞానమును వ్యాపింపజేయవలసిన అవశ్యకము అవంతయైన తగ్గలేదు. ఇట్టి స్థితి మిక్కిలి శోచనీయమే యైనను మనకు గత్యంతరములేదు. ఎందుచేత ననగా, నూటికి తొంబదికంటె ఎక్కువమందికి జ్ఞానమును వ్యాపింపజేయుటకు మార్గమదియొక్కటేను.

పల్లెటూరునందుండనీ, బస్తీయందుండనీ, కొండయందుండనీ, గుట్టయందుండనీ, అడవియందుండనీ బయలు ప్రదేశమందుండనీ—పురుషులైనను సరే, స్త్రీలైనను సరే, పిల్లలైనను, పెద్దలైనను—మానవు లందరికి ఎవరికి తగినట్లు వారికి జ్ఞానవ్యాప్తి కలుగుటకు తగిన సావకాశ ముండవలయును''

గొడవలు పెంచవద్దు

కొత్తగా ఏర్పడే జిల్లాబోర్డులకు అధ్యక్షులను ఎన్నుకోవడం కంటే నామినేటు చెయ్యడం మంచిదని సమర్థిస్తూ సమదర్శిని ఇలా రాస్తోంది.

''తాలూకాబోర్డులను రద్దుసేయుటకయి, యిపుడు, శాసననిర్మాణసభలో జర్చింపబడుచున్న సవరణచట్టపు (లోకల్‌బోర్డ్సు అక్టు) వివరములు, ఈసరికి, పాఠకులు, క్షుణ్ణముగ దెలిసికొనియుందురని యూహించవచ్చును. దొరతనమువారు కొన్ని జిల్లాబోర్డులను రెండేసిగ చీల్చి, యాజిల్లాలలో రెండేసి లోకల్‌బోర్డులను నిర్మింతురు. రెండు బోర్డులేర్పడినచోట ఒక బోర్డునకు, ఇపుడున్న జిల్లాబోర్డు ప్రెసిడెంటే ప్రెసిడెంటుగ నుండును. రెండవ క్రొత్త లోకల్‌బోర్డునకు క్రొత్తగ ఏర్పడు లోకల్‌బోర్డు సభ్యులు తమలో నొకరిని—తమ బోర్డున కధ్యక్షునిగ నెన్నుకొనవచ్చునని సవరణ చట్టములో ప్రతిపాదింపబడి యున్నది. క్రొత్తగ నేర్పడు లోకల్‌బోర్డులకు జెందు నామినేటెడ్ మెంబర్ల సంఖ్య (మైనారిటీసంఘములు. నిమ్నజాతులసంఘములు—మహమ్మదీయ—క్రైస్తవసంఘములు మున్నగువాని ప్రాతినిధ్యముకొఱకు దొరతనముచే నామినేటు సేయబడు బోర్డుమెంబర్లు) తగ్గియుండినయెడల కొఱవడిన మెంబర్లను దొరతనమే నామినేటుచేయును.

క్రొత్తగ నేర్పడు బోర్డులు తమ ప్రెసిడెంట్లను ఎన్నుకొనవలసి వచ్చినయెడల—ప్రెసిడెంట్ల ఎన్నికల నిమిత్తము తలచూపు ఆర్భాటములు వృథా వ్యయ ప్రయాసలు అన్నియు ప్రారంభమగును. వర్తమానారికదుస్థితియం దట్టి వృథా వ్యయప్రయాసలకీ క్రొత్తబోర్డుల మెంబర్లను లోబరచుటకంటె—నీ క్రొత్తబోర్డులకు దొరతనమువారే ప్రెసిడెంట్లను నామినేటు సేయుట యుచితమని యొక యభిప్రాయము మిక్కిలి సహేతుకముగ బయలువెడలినది. లోకల్‌బోర్డులయొక్క జనరల్ ఎన్నికలు కొన్నిమాసములలో (అనగా ఈనవంబరో—డిసెంబరో) జరగవలసి యున్నదని తెలియుచున్నది.

ఈ కొలది మాసముల కాలమునకయి యెన్నికల యార్భాటములతో ప్రజల నావేశపెట్టుట మంచిపని కాదు. 1985 లో క్రొత్త శాసనసభల యెన్నికలు జరుగవచ్చునని తలంపబడుచున్నది

గదా. ఆ యార్భాటములకు, వృథా వ్యయప్రయాసలకు మితియుండదు గదా. ఎన్నివిధముల రోచించి చూచినను, క్రొత్త లోకలుబోర్డులకు, దొరతనమే నామినేటు సేయుట సభ్యమయియుండుననియు, ప్రజాలాభకరమయి యుండుననియు చెప్పగలము, "జస్టిస్" పార్టీవారు క్రొత్తలోకలు బోర్డులకు నామినేటెడ్ ప్రెసిడెంట్ల నేర్పాటు చేయించుటకే యుద్యమింప దీర్మానించుట కెంతయు సంతసము కలుగుచున్నది. శాసన నిర్మాణ సభ్యులందరు ఈ యభిప్రాయము నామోదించి సవరణచట్టములో ప్రతిపాదింపబడి యున్న యెన్నికల యధికారమును తొలగించి నామినేటెడ్ ప్రెసిడెంట్లను వేయింప సవరణచట్టమును సవరింపింప హెచ్చరించుచుచున్నారము."

ప్రకీర్ణకములు

అభినవాంధ్రకవిపండితసభపై విమర్శలు

విమర్శలకు గురియైన "అభినవాంధ్రకవిపండితసభ" లోకదృష్టి నాకర్షించుచున్న దన్న మాట. అది కొంత మేలే.

ప్రబుద్ధాంధ్రపత్రిక కర్తవ్యమును మరిచిపోయినారని ఈసభను గూర్చి విమర్శించింది. భారతీపత్రికకూడ తచ్ఛాయనే విమర్శనాదృష్టి సారించింది.

అయితే ఈసభ కర్తవ్యమేమిటిగా, సభవారెంచుకున్నారు. ఆకర్తవ్యమేనా ఈపత్రికాధిపతులు చూచించి చెప్పుచుంట? ఈసభ వారి కర్తవ్యమేమో వీరు మొదట బరంపురములో జరిపిన సభను బట్టిన్ని, అప్పుడు వారు తీర్మానించుకొన్న తీర్మానాల బట్టిన్ని మనము ఊహించుకోవచ్చు. అభినవాంధ్రకవులనూ పండితులనూ ఒకచోట చేర్చడమున్నూ, వారివారి రచనలను వెల్లడి చేయడమున్నూ ఇదివరలో జరిగిన పని. రెండవ సమావేశములోకూడా ఆపనే జరిగినది. దీనివల్ల లాభమున్నదా అంటే ఉన్నదనే చెప్పవలెను. నేటి సారస్వతస్వరూపము ఎట్టి విధముగా పరిణమిస్తున్నదో తెలిసికొనుట కిది సహాయముగా ఉండును. ఇదిగాక మొదటి సభలోవలెనే ఈసభలోనున్నూ కడపటి దినమున కొన్ని తీర్మానాలు సభవారు చేసుకొన్నారు. అవి దరిమిలాను ఆంధ్రపత్రికలో ప్రకటింపబడ్డవి.

ఈపత్రికాధిపతుల కర్తవ్యమేమిటో? నేటి సారస్వత విమర్శ అయినట్లయితే అట్టి విమర్శ ఈ సభలో జరిగింది—భాషావిమర్శ—రామమూర్తి పంతులుగారు; బాలసారస్వత విమర్శ సీతాపతిగారు; ఏకాంకరూపక విమర్శ—గణపతి సాహిత్యశిరోమణిగారూ, కావ్యవిమర్శ—దిగుమర్తి రామారావుగారూ, ఇట్టివి చాలా జరిగినవి.

కవుల కృతుల వినిపించడమయితే—అవి కావలసినన్ని జరిగినవి—కవికొండల వెంకట్రావుగారు, వేమల సత్యనారాయణశాస్త్రి, నాళం కృష్ణారావుగారు, సూర్యప్రకాశరావుగారు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వగైరా చాలామంది ఉన్నారు.

ఉపన్యాసము లివ్వడమయితే—అవి అధికముగా జరిగినవి.

తీర్మానాలు అంగీకరించడమైతే అవిన్నీ జరిగినట్లు ఆంధ్రపత్రిక సాక్షి.

మరి వీరు చూచించిన కర్తవ్యముపై వాటి యందున్నట్లే గదా?

ఇట్టి కథలు ఉండవలెను, ఇట్టి నాటకము లుండవలెను ఇట్టి విమర్శ లుండవలెను — అని ఒకవేళ ఇట్టి తీర్మానాలు చేస్తే ఈ సభవారి మాట వినేవా రెవరు. ఆంధ్రసాహిత్యపరిషత్తువారి మాట ఎవరైనా వింటున్నారా? కవి తన శక్తి, ఉత్సాహము, ప్రతిభలను అనుసరించి తనకు మంచి

దని తోచిన కావ్యము రచిస్తాడు. అందు మంచి ఉంటే లోకులామోదిస్తారు. కాని ఇట్టి కావ్యములే కవులు రచించవలసి ఉంటుందని ఎవరు వారిని శాసించగలరు.

కవులు తమ కృతులూ, తమ తండ్రుల తాతల కృతులూ చదివినారని యింకో ఆక్షేపణ. ఎందుకు చదవకూడదు? పత్రికలలో పడ్డవి మాత్ర మెందుకు చదవకూడదు? పత్రికలలో పడ్డంతమాత్రమున వాటి నందరూ చదువుతున్నారా? శిష్టుల అభిరుచులను ప్రమాణముగా అంగీకరిస్తే కావ్యముల మంచిచెడ్డలను నిర్ణయించేటందుకు యిట్టి సభలలో వాటిని చదవవలసి ఉంటుంది.

ఆంధ్రభూమి పత్రికలో ఒక సుప్రసిద్ధ స్త్రీని గురించి కటువుగా విమర్శించారు. ఈసభల విశిష్టత ఏమిటంటే పురుషులే కాకుండా స్త్రీలు కూడా పాల్గొనడము. అట్టి స్త్రీలు పండితలో కారో, కవయిత్రులో కారో ఎవరు నిర్ణయించేది? ఈ పురుషులపట్ల నిర్ణయించే దెవరు? ఒక స్త్రీయే కాదు చాలామంది స్త్రీలు ఈ సభలలో పాల్గొన్నారు. ఇది ఆంధ్రులు గర్వించవలసిన విషయము. సారస్వతసభలలో స్త్రీలు పురుషులతోపాటు సారస్వతచర్చలు చేయడం ఆంధ్రాభ్యుదయానికి చిహ్నము. అట్టి స్థితిలో "ఈదేశ బాంధవి భాషాబాంధవి ఎప్పుడైనది. ఈ పూర్వసువాసిని అభినవాంధ్ర కవయిత్రి కూడ ఎప్పుడైనది" అని ఆంధ్రభూమివంటి పత్రికలు తృణీకారభావముతో తూలనాడడము మిక్కిలి విచారించవలసిన విషయము. సారస్వత సేవ చేస్తున్న స్త్రీ లెందరో మన ఆంధ్రదేశములో ఉన్నారు. వీరు కూడ యిట్టి సారస్వతసభలలో పాల్గొనేటట్లు పత్రికలు ప్రోత్సహించవలసి ఉంటుంది.

ఇట్టి సభలు జరగడానికి ముందుగానే సభలు జరుగుతవని పత్రికలలో ప్రకటనలు పడతవి కాబట్టి అప్పుడే యిట్టి సభల కర్తవ్య మెట్టిదిగా ఉంటే బాగుంటుందో పత్రికలు సూచించడము మంచిది ఇట్టి సూచనలను సభలు అంగీకరించకపోతే పత్రికలు సకారణముగా విమర్శించవచ్చును. అంత్య నిష్ఠూరం కంటె ఆది నిష్ఠూరం మంచిది.

చింతా దీక్షితులు, 2-3-34

(ప్రబుద్ధాంధ్ర విమర్శనం మరివొక మాటు చదవవలసిం దని శ్రీ దీక్షితులు గారిని కోరుతున్నాము. సంపాదకుడు)

కొన్ని సంశయాలు

కొంతకాలం కిందట—నాలుగో ఫారం అయిదో ఫారం చదివేటప్పుడు—వాడుక భాషను చులకనగా చూసేవాణ్ణి. నేను తరవాత కాలేజిలో ప్రవేశించినప్పుడు - భారతి మొదలైన మాసపత్రికల్లో వాడుకభాషలో రాయబడ్డవి చాలా అందమైన వ్యాసాలు చదివాను. నామనసు గ్రాంధికభాషకూ వాడుకభాషకూ మధ్య ఊగుతూన్న సమయంలో గిడుగు రామమూర్తి పంతులుగారు మావాళ్ళలుకు దయచెయ్యటం కాలేజీలో ఉపన్యాసం ఇవ్వటం జరిగినై. అప్పుడే వారు "అట్టిడు" అనే పదానికి ద్వితీయావిభక్తి బహువచనం ఎవరైనా చెప్పగలిగితే తమ ప్రయత్నం మంతా మానేసి గ్రాంధికభాషాసేవ చేస్తా మని ఛాలెంజి చేశారు. ఆరోజునించీ నాకు గ్రాంధికభాషమీద అభిమానం పోయింది. కాని అప్పటినించి ఇప్పటివరకూ ఒక సంశయం ఉండనే ఉంది.

అ దేమిటంటే—అందరికీ ఉపకరించే తెలుగేది?

తూర్పున "అలా" అంటారు. మా వైపున "అట్లా" అంటాం. మేం "ఏమిటి" అంటాం. ఒంగోలు వైపున "ఏంది" అంటారు. ఇటువంటి భేదాలు ఉండితీరాలి. వాటిల్లో ఒక విధమైన మాధుర్యం లేకపోలేదు ఇన్ని లక్షల ఆంధ్రులకూ పనికివచ్చే భాష ఒకటి ఉండాలా వద్దా? ఇది శాస్త్రసమ్మతమైన ఇంగ్లీషూ, ఇది వాడుకభాషా

అని ఉంది. ఇది శాస్త్రసమ్మతమైన తెలుగు, ఇది వాడుకభాష అంటూ ఏది? శాస్త్ర మేది? పోనీ తెలుగులో నిఘంటువు ఒకటి వచ్చి ఇది స్టాండర్డు తెలుగు మాట, ఇది వాడుకపదం అని చెప్పే వరకూ కాస్త అటూ ఇటూగా వాడుకభాషే రాద్దా మనుకున్నాను.

అందువల్లనే భమిడిపాటి కామేశ్వర్రావుగారూ, గుడిపాటి వెంకటాచలంగారూ, కవికొండల వెంకటరావుగారూ, (వీరు రాసినట్టే మాట్లాడతా రని నాకు నమ్మకం లేదు. మాట్లాడతా రని తెలిస్తే మాత్రం నేను చాలా ఆశ్చర్యపడతాను.) వారివారి భాషల్లో రాస్తుంటే చదివి సంతోషిస్తున్నాను.

ఫిబ్రవరిలో "బిడ్డల శిక్షణ" తలపేర ప్రచురింపబడ్డ టేకుమళ్ల కామేశ్వర్రావుగారి వ్యాసంలో చివర భాగం చూస్తే నేనింకా వెరటిదారినే ఉన్నట్టు కనిపిస్తుంది!

శైలి. ఎవరు మాట్లాడే భాష వారు రాయటాని కుపయోగిస్తున్నా రని నా ఉద్దేశం. "పూర్ణానుస్వారం, విసర్గం, సంస్థ," మొదలైనవాటిల్లో శకావత్తూ, పొట్టలో చుక్క థావత్తూ వెంకటాచలంగారు సరిగా పాటించకపోవటం వారి శైలిలో లోపంగా కామేశ్వర్రావుగా రభిప్రాయపడ్డారు. మరి వెంకటాచలంగారు "పూర్ణానుస్వారం, సంస్థ" అనరు నోటివెంట. అనకపోయినా వారి నెవరూ ఆటకాయించటం లేదు. పొట్టలో చుక్క థావత్తులు కాశిలో వదిలేసి వచ్చినవాణ్ణి నే నొకణ్ణున్నాను. అనేకమందిమి వాడుకభాషలో రాయనిచ్చిన తరవాత దాస్యవిముక్తి లభించినట్టు ఫీ లవుతున్నాం. కామేశ్వర్రావుగారు చెప్పేది చూస్తే అటువంటి విముక్తి మాకింకా లభించినట్టు కనపడదు.

వాక్యారంభంలో అచ్చులు. "యిష్టం, వురమూ, యీశిక్షణ," మొదలైనవి వాక్యం మొదట వచ్చినప్పుడు అచ్చుగానే ఉంటే బాగుంటుం దని కామేశ్వర్రావుగారి అభిప్రాయం. "ఉండాలి" అనే మాటను "వుండాలి" అని కామేశ్వర్రావుగారు వ్రాస్తునే ఉన్నారు. ఉ॥ "...యిట్టి మాటలు అచ్చుతో వుండాలి..." ("వు" అచ్చు పొరపాటయితే నేను జవాబుదారీ కాదు.) "తో" అనే ప్రత్యయం "తోన్" కానంతవరకూ "ఉండాలి" అనే మాట "తో" తరవాత వచ్చినా వాక్యారంభంలో వచ్చినా ఒకటే.

తెలుగు మధ్య ఇంగ్లీషు కాలక్రమాన బండీరాలు అరసున్నాలు, అదేమి టిదేమిటి? మొత్తం మొత్తంగా గ్రాంథికభాషనే విసర్జించిన వారిలో కూడా అనేకమంది సంస్కృతపదాలు దొర్లితే గమనించరు కాని ఇంగ్లీషుముక్క దొర్లినట్లాయనా గుర్రుమంటారు. సంస్కృతపండితులు సంస్కృతం మనస్ఫూర్తిగా (సరి యయిన తెలుగు మాట ఉన్నా) వాడవచ్చును కాని తప్పని సరిగా ఇంగ్లీషు చదివిన వాడు ఒక్క ఇంగ్లీషు ముక్క రాయ రాదు! కామేశ్వర్రావుగారు ఈవిషయం అంత పట్టుదలగా ఉండ లేదు. పుస్తకం ఆడవారికోసం రాయబడ్డది కదా ఇంగ్లీ షెందు కన్నట్టు చెప్పారు. "ప్రిన్సిపిల్సు, టెంపరిమెంట్" మొదలయిన మాటల జాబితాలో ఒక్క ముక్కకు కూడా నాకు తెలుగు తెలీదు. శంకరనారాయణ డిక్షనరీ చూస్తే తెలుగు తెలుస్తుం దేమో కాని ఆమాటలు ప్రతిరోజూ ఉపయోగించనివి కావటం చేత తర్జుమాకన్న ఇంగ్లీషుముక్కే రాయ బుద్ధవుతుంది.

కామేశ్వర్రావుగారియందు నే నేవిధమైనతప్పు ఆరోపించబోవటం లేదు. వారు భాషను గురించి ఈ మూడు విషయాలూ బయట పెట్టారు. ఈవిధంగానే మరొకరు మరికొన్ని కట్టుబాట్లు కోరవచ్చును. ఈ విషయాల్లో ఒకరు చెప్పవలసిందీ మిగిలినవారు వినవలిసిందీ కాని గత్యంతరం లేదు. కట్టుబాట్లు వద్దనటానికీ వీల్లేదు; మనిషి కొక తెలుగై ఊరుకుంటుంది—ఇప్పుడు కానే అయింది. అటువంటప్పుడు చేయదలుచుకున్న కట్టుబాట్లన్నీ ఒక

గ్రంథంలో రానీ పబ్లిషు చేస్తే అందరం కొనుక్కుంటాం. నామటుకు నాకు ఇంగ్లీషుమాటలకు సరి యయిన తెలుగు రాదని చెప్పుకోటం నామర్దా లేదు. ఉన్నదే ఒక ఇంగ్లీషు—తెలుగు డిక్షనరీ. అది సరయినదని నమ్మకం లేదు. సంస్కృతం చదువుకో లేదు. నామర్దా ఏదన్నా ఉంటే చక్కని తెలుగు మాని ఇంగ్లీషు చదువుకోటంలోనే ఉండాలి. కాని అదీ అనటానికి వీల్లేదు. తెలుగులో కృషి చెయ్యా అంటే ఆపని కాలేజీలో జరగదు (ఆంధ్రా యూనివర్సిటీలో కూడా!) ఇంగ్లీషులిటరేచరు చదివే విద్యార్థులు ఎం. ఏ. కు పొయ్యేవరకూ చాసరు గాని అంతకు పూర్వపు రాతగాళ్ల రాతలు గాని చదవనక్కర్లేదు. తెలుగు సారస్వతం చూడబోతే నన్నయభట్టారకుడితో ప్రారంభమై పెద్దనదగ్గరో ఆప్రాంత్యాలో ఆగిపోయినట్టు కనిపిస్తుంది. ఈ కాలపు తెలుగు రాస్తేనున్నా పెడతారు పరీక్షల్లో. ఇక వాడుకభాషలో రాసేవాళ్ల గతి ఏమిటి? తాత్కాలికంగా ఒక సారి చదివి ఆనందించి అవతల పారేసే కథలు (వాటిల్లో ఒక మొగుడూ, ఇద్దరు పెళ్లాలూ ఉంటే ఒకత్తె చస్తుంది. అంతా బాగుంటారు) ఏదో భాషలో రాస్తారు. ఇబ్బంది లేదు అదంతా లైట్ లిటరేచర్. రేపు నేను చుక్కల మీద ఒక వ్యాసం రాయా లనుకుంటాను. వ్యావహారికభాష అనే పదం ఆధారం చేసుకుని చూస్తూ చూస్తూ కోర్టుభాష ఎట్లా ఉపయోగించను? చాతయిన దేదో మాట్లాడేదే ఉపయోగిస్తే ఎవరి ఇష్టం వచ్చిన తప్పులు వారు పడితే నే నేం కావాలి?

కాబట్టి రాయగల ప్రముఖులను ప్రబుద్ధాంధ్రలో వ్యాసాలు రానీ, భాషకు అవసరమైన కట్టుబాట్లన్నీ చేసి, ప్రతిగాలికీ ఎగిరిపోకుండా అవయవాలు స్వేచ్ఛగా కదిలించడానికి వీలు లేకుండా వుండకుండా తగిన ఏర్పాటు చేసి తెలుగుభాషను కూడా స్టాండర్డైజు చేసి పుణ్యం కట్టుకో మని ప్రార్థిస్తున్నాను.

కొడవటిగంటి కుటుంబరావు